

KSR02B112C

ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

మార్చి 13, 2016

కథా నిలయం
ENTERED
శ్రీకాకుళం



'ఢీ'-20

బాలీవుడ్ కథాబలం

కథల్లోని కొన్ని పాత్రలు అలా గుర్తుండిపోతాయి. పరిచయమయ్యే వ్యక్తుల్లో ఎదురై పలకరిస్తాయి. పాత్రలే కాదు కథలూ అంతే మన జీవితాలకు సమాంతరంగా మరో జీవితంగా వాటిల్లోకి నడిపించేస్తాయి. అంత ప్రభావం చూపే పాత్రలు, కథలు సినిమాల్లోను కదలాడుతుంటాయి. చదువరలనే కాక చూపరులను కట్టిపడేసిన ఆ సృజనలెన్నో చిత్రసీమకు ఊపిరినిచ్చాయి. పుస్తకాల కథలు, వెండి తెర చిత్రాలు కలసి ఉచ్ఛ్వాస నిశ్వాసలు తీస్తూ సగటు ప్రేక్షకుడికి నిజజీవితంలోని సబ్జెక్ట్‌లుగా నిలిచిపోయాయి.

ఉమ్రావ్‌జాన్, పరిణీత, ఓంకార, మక్బూల్, ది నేమ్‌సేక్, 7 ఖూన్ మాఫ్, జునూన్, లూటెరా, ప్రైడ్ అండ్ ప్రిజుడీస్, 3 ఇడియట్స్, బ్లాక్ ఫ్రైడే, సావరియా, పింజార్, ఏక్ థీ దయాన్‌లు బాలీవుడ్‌కు కథా బలాన్ని పెంచాయి. ఆర్.కె.నారాయణ్ 'గైడ్' నవలతో దారి కనుగొని శరత్ చంద్ర 'దేవదాస్' ఎప్పటికప్పుడు పలకరిస్తూ, షేక్స్‌స్పియర్ నవలలకు అడిక్టయి నిన్నటి హామ్లెట్ అడాప్టేషన్ 'హైదర్' వరకు వచ్చిన చిత్రాలు ఇటు సామాన్యుడిని మెప్పిస్తూనే అటు విమర్శకులతో చప్పట్లు కొట్టించుకున్నాయి. నిన్నమొన్నటి రణ్ బీర్ కపూర్, అనుష్క శెట్టి నటించిన 'బాంబే వెల్వెట్' కూడా ఇదే కోవలోకి వస్తుంది. చరిత్రకారుడు గ్యాన్ ప్రకాశ్ రాసిన 'ముంబై ఫేబల్స్' ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. చార్లెస్ డికెన్స్ అద్భుత సృష్టి అయిన 'ది గ్రేట్ ఎక్స్‌పెక్టేషన్స్'లోని పిప్ పాత్రలోని ఛాయలు సిద్ధార్థ రాయ్ కపూర్ నిర్మించిన 'ఫితూర్'కు వెలుగునిచ్చాయి. త్వరలో.. జపాన్‌కు చెందిన మిస్టరీ నవలాకారుడు కీగో హిగాషినో రాసిన మరో సంచలన థ్రిల్లర్ 'ది డివోషన్ ఆఫ్ సస్పెక్ట్ ఎక్స్' కూడా హిందీ సినిమాగా రాబోతోంది. బాలాజీ టెలీ ఫిల్మ్స్ దీన్ని తెరకెక్కించబోతోందని వార్తలు. నేర పరిశోధన నేపథ్యంగా సాగిపోయే ఈ నవలలో గుండెను మెలిపెట్టే భావోద్వేగాలు, ఊహకందని మలుపులు ఉంటాయి. శివ ట్రయాలజీతో ఒక్కసారే అందరి నోట వార్తై సంచలనం సృష్టించిన అమీష్ త్రిపాఠి రచించిన తొలి పుస్తకం 'ది ఇమ్మోర్టల్స్ ఆఫ్ మెలూహా'ను కూడా త్వరలో సినిమాగా చూడొచ్చు. కరణ్ జోహార్ ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టబోతున్నాడు. ◆













కథా నిలయం శ్రీకాకుళం
ENTERED KSR02 B112

ఉత్తరప్రదేశ్‌లో అదో వెనుకబడిన జిల్లా. పేదరికానికి పెట్టింది పేరైన ఆ ప్రాంతంలో... ఆడపిల్ల పుడితే ఖర్చుల ఖాతా తెరిచినట్టే భావిస్తారు. అంత లేమిలోనూ ఆ పిల్లకు ఎప్పుడెప్పుడు పెళ్లి చేద్దామా, ఎంత ఘనంగా అత్తారింటికి సాగనంపుదామా అన్నదే వాళ్ల ఆలోచన. అంతకు మించి ఆమె ఆరోగ్యం, ఆహారం, అక్షరం గురించి పట్టించుకోవాలన్న విచక్షణే వుండదు. వివక్ష తప్ప. అలాంటి జిల్లాలోని ఓ చిన్నిగ్రామం పెద్ద నిర్ణయం తీసుకుంది. 'కట్నం ఇవ్వం. తీసుకోం' అని ప్రతిజ్ఞ చేసింది. అదీ ప్రపంచ మహిళా దినోత్సవానికి వారం రోజుల ముందు. కేరళలోని నీలాంబర్ గ్రామం సైతం కట్నం ఊసే లేని ఊరుగా పేరొందింది.

కట్నం ఇవ్వం తీసుకోం

గత కొద్ది రోజులుగా వార్తల్లో తరచూ వినిపిస్తున్న ఆ గ్రామమే పిరైలా. ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థ్ నగర్‌లో వుంది. అక్కడ మొత్తం మీద 200 కుటుంబాలుంటే... వాటిలో 120 ముస్లింలవి. 80 హిందువులవి. కొద్ది రోజుల కిందటి వరకు కుటుంబంలోకి ఆడపిల్ల వచ్చినప్పటి నుంచి వరకట్నం గురించే ఆలోచించేవారు. పౌష్టికాహారం, ఆరోగ్యం, చదువుకు అయ్యే ఖర్చుని సాధ్యమైనంత వరకు తగ్గించుకుని కూడబెట్టే ప్రయత్నం చేసేవారు. ఆ మొత్తంతో అబ్బాయికి కట్నం, అమ్మాయికి బంగారం పెట్టి, పెళ్లి అంగరంగ వైభవంగా చేసేవారు. అందుకే అమ్మాయి చదువు పట్ల చిన్న చూపు వుండేది. ఒకవేళ బడిలో వేసినా నామక:నే. రెండు మూడేళ్ల వానాకాలపు చదువుల తర్వాత ఇంటిపట్టునే వుంచేసేవారు. వివాహ వయస్సు రాక మునుపే పెళ్లిచేసేసేవారు. అప్పటి వరకు ఆడపిల్ల మీద ఒక్క పైసా ఖర్చు చేయడానికి సైతం వెయ్యి రకాలుగా ఆలోచించేవారు పెళ్లి సందర్భంగా మాత్రం ధారాళంగా వెచ్చించేవారు. ప్రతి దశలోనూ ఇరుగుపొరుగు గొప్పగా చెప్పుకునేలా వుండాలనుకునేవారు. వరకట్న హత్యలు, వేధింపులు విపరీతంగా వుండేవి. 2014వ సంవత్సరంలో దేశం మొత్తంమీద 8,455 వరకట్న హత్యలు నమోదైతే, కేవలం ఉత్తర ప్రదేశ్‌లోనే 2,469 రికార్డయ్యాయి. రాష్ట్రంలో రోజుకి ఆరుగురు మహిళలు బలి అవుతున్నారు. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లో తమ ఆడపిల్లలను కాపాడుకునేందుకు ఒక గొప్ప ఆలోచన రగిల్చింది 'అంజుమన్ రజా ఏ ముస్తఫా'. ఆ కుగ్రామంలో వరకట్నమనే రక్కసి బారి నుంచి ఆడపిల్లలను కాపాడేందుకు ఏర్పడి పని చేస్తున్న ఎన్జీఓ సంస్థ ఇది. చొరవ చేసి చైతన్యం రగిల్చి గ్రామస్తులంతా ఏకతాటి పై నిల్చి 'కట్నం తీసుకోం. ఇవ్వం' అన్న ప్రతిజ్ఞ పూనేలా చేసింది. అంతేకాదు. ఎవరైనా ఒకవేళ వరకట్నం అడిగితే... వారిని గ్రామ బహిష్కరణ చేసినట్టే చూస్తారు. ఏ కష్టమొచ్చినా ఎవ్వరూ సాయం చేయరు. ఒక రకంగా వెలి వేసినట్టే.

కట్నం ఊసు లేని ఊరు

కేరళలోని నీలాంబర్ ముస్లిమాన్లు అధికంగా వున్న గ్రామం. 'డౌరీ ఫ్రీ విలేజ్'గా పేరొందింది. అయితే అదంతా ఒక్క రోజులో వచ్చి పడలేదు. దానికి ముందు ఎంతో మంది అమాయకపు ఆడపిల్లలు, మహిళల కన్నీళ్లు, కష్టాలు వున్నాయి. కట్నపు రక్కసిని పారదోలాలన్న ఎంతోమంది పట్టుదల వుంది. ఆ గ్రామస్తులంతా దాన్నొక యాగంగానే చేపట్టారు. 2007లో చేపట్టిన గణాంకాల సేకరణతో ఆ యజ్ఞం ప్రారంభమైందనుకోవాలి. ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం, వారికిచ్చే కట్నం కోసం ఇళ్లను, పొలాలను తాకట్టు పెట్టి దివాళా ఎత్తిన తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో వున్నట్టు తేలింది. ఆ రుణాలు తీర్చడం కోసం పంచాయతీలలో అప్పులు చేశారు. 2009లో కట్నం లేని ఊరిగా ప్రతిజ్ఞ పూనారు గ్రామస్తులు. అందుకు మున్సిపాలిటీ ఛైర్మన్ షౌకత్ కృషి ఎంతైనా వుంది. అందుకోసం అనేక చర్యలు చేపట్టారు. ముందుగా గ్రామంలోని యువతీయువకులను, తల్లిదండ్రులను అనేకమార్లు సమావేశ పరిచి కట్నం ఎంత ప్రమాదకరమైనదో అర్థమయ్యేలా ఉదాహరణలతో సహా వివరించారు. చదువు ఆగిపోయిన యువతను తిరిగి చదువుకునేలా ప్రోత్సహించారు. వారి కాళ్ల మీద వాళ్లు నిలబడగలిగేలా సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఎక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నా, కట్నం ఇచ్చిపుచ్చుకుంటున్నా అక్కడ వాలిపోతారు 'పండాల్' సభ్యులు. మొత్తం మీద 'డంప్ డౌరీ' సంఘాల పాత్ర ప్రశంసించదగినది. 'డౌరీ ఫ్రీ మేరేజ్' వెబ్‌సైట్‌ని ప్రారంభించారు. ఎవరైనా సరే ఇందులో పేరు, వివరాలు నమోదు చేసుకోవచ్చు. అయితే అందుకు ముందుగా గ్రామ పంచాయతీ వారి వివరాలను పరిశీలించి అనుమతి ఇవ్వాల్సి వుంటుంది. ఆ తర్వాతే వెబ్‌సైట్‌లో స్థానం సంపాదించుకోగలుగుతారు. ఇలా అనేక దశల్లో శక్తివంచన లేకుండా కృషి చేయడం వల్లే కట్నం లేని ఊరుగా పేరు సంపాదించుకుంది నీలాంబర్.

ఇండెక్స్

మార్గదర్శి........ 2
కట్నం ఇవ్వం తీసుకోం

సేవ.................. 3
మెడికల్ యాత్ర

స్టార్................ 4
కొలవెరీ ఢీ 'అని'

కార్టూన్ పంచ్......... 5

'ఢీ'-20

యువ.................10
కుడి కాలి వాటం బౌలర్

తెలుసా................11

అట్టమీది కథ.........6

స్ఫూర్తి....12
సైన్స్ టీచర్
విశిష్ట రైతు అయిన వేళ

నా కళ్ళతో...............14
మరిగే నదిని వెదుకుతూ..

వింతలోకం.............16
బట్టలుతికే సైకిల్

కవిత్వమ్...........17
అక్షర దీపికలు

కథ......................18
కథలు చెప్పకు!

రుచి......................21
యాపిల్ జ్యూస్

బాలనేస్తాలు.............22
లిల్లీ ఫ్లవర్ బొకే



స్ఫూర్తి నింపిన సాహసి

తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అందరినీ కాపాడిన సాహసి 'పైలట్ నీర్జా' బతుకు పోరాట విశేషాలు కంట తడి పెట్టించాయి. జీవితంలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా వాటిని ఎదుర్కొని నిలిచిన ఆటో రూబీ జీవిత విశేషాలు ఆద్యంతం చదివించాయి. హాబీ అంటే ఇష్టంతో చేసే పనే అయినా దాన్ని కొనసాగించడంలో ఎదురయ్యే కష్టాలను, విశాఖ వాసి రవిశంకర్ మల్టీ హాబీల గురించిన వివరాలు చక్కగా తెలిపారు. కపూర్ ఫ్యామిలీకి చెందిన అర్జున్‌కపూర్ యాక్టింగ్ వివరాలు బాగున్నాయి. ఆఫ్రికాకు చెందిన బ్లాక్ మాంబా దళం, బ్రూక్ మినియేచర్ ఆర్ట్స్, సైన్స్‌డే విశేషాలు చక్కగా ఉన్నాయి.

శ్రీనివాస్, విశాఖపట్నం

ఆకట్టుకున్న పోరాటం

తమకంటూ ఓ గుర్తింపు కోసం అందరూ పాకులాడుతుంటారు. అయితే అడుగడుగునా ఎదురయిన ఛీత్కారాలు, సవాళ్లకు ఎదురీది తన జీవన గమ్యాన్ని చేరుకున్న ఆటో డ్రైవర్ రూబీ అలుపెరుగని జీవన పోరాటం అందరికీ మార్గదర్శకం. ఆయుధాల్లేకుండా వేటగాళ్ల

బారి నుండి అంతరించిపోతున్న జంతువులను కాపాడే బ్లాక్ మాంబా దళం విశేషాలు ఆద్యంతం ఆసక్తికరంగా ఉన్నాయి.

చదువుకోవాలనే తపనతో బ్రిడ్జి కింద బడిలో పాఠాలు నేర్చుకుంటున్న ఢిల్లీ చిన్నారులను, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్న మాస్టారునీ ఎంతగా అభినందించినా తక్కువే. కార్టూన్ పంచ్, నాటి తరం మోడల్ నీర్జా గురించి తెలిపిన వివరాలు బావున్నాయి.

విద్యా సాగర్ , కర్నూలు

నిజంగా రూబీనే

వీకోటర్మరిక్ యాడ్‌లో నీర్జాని మా చిన్నతనంలో చూసేవాళ్లం. పైలట్‌గా నీర్జా ఒక ధీర వనిత. ఆమె గుంచి మాకు తెలియని ఎన్నో విషయాలను అందించినందుకు సంతోషం. ఆటోడ్రైవర్ రూబీ నిజంగా రూబీయే! అమె తన జీవిత నిర్ణయాలు, కుంటుంబ బాధ్యతలు చేపట్టిన తీరు ఆదర్శవంతంగా వుంది. "మల్టీ హాబీ స్టార్" రవిశంకర్ హాబీల వివరాలు, అంతిమం కథ బాగున్నాయి.

పద్మ, నెల్లూరు

మార్పు రావాలి

అరటి పండులో ఉండే హానికాని అణుధార్మికత, వాటిలో ఉండే వైద్య లక్షణాల గురించి 'తెలుసా'లో తెలిపిన విషయాలు ఉపయోగ కరంగా ఉన్నాయి. 'బాల నేస్తాలు'లో ఆకులతో చిలుక, పేపర్ ప్లేట్ చేపలు, పొట్లకాయతో వెరైటీలు చక్కగా వున్నాయి. వంటకాలను రంగు పేజీలో అందిస్తే బావుంటుంది. మాంసాన్ని బయోరియాక్టర్ ట్యాంకుల్లో పెంచే విధానం, భార్యకు ప్రేమతో పూలవనాన్ని చేసిన మియాజాకీ కబుర్లు ఆహ్లాదాన్ని అందించాయి. ఆటోడ్రైవర్ రుబీ, పైలెట్ నీర్జా గురించి ఇచ్చిన విషయాలు బాగున్నాయి.

శ్రావణ్, తెనాలి

కదిలించిన నీర్జా కథ

వివిధ యాడ్స్‌లో చాన్నాళ్ల క్రితం నీర్జాను చూసేవాళ్లం. పైలట్‌గా మారిన నీర్జా గురించి తెలిపిన వివరాలు మా మనసుని కదిలించాయి.రవిశంకర్ మల్టీ హాబీల వివరాలు, బ్రిడ్జిని బడిగా చేసుకుని చదువుచెప్పే మాస్టారు, పరిస్థితులతో పోరాడి ధైర్యంగా నిలిచిన ఆటో డ్రైవర్ రూబీ వివరాలు హృదయాన్ని హత్తుకున్నాయి. -కల్పన, కర్నూలు

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

మెడికల్ యాత్ర

బతుకంతా కాకపోయినా వీలు చిక్కినప్పుడల్లా ఇతరులకు సాయపడటం గొప్ప పనే. మనం ఎన్నో యాత్రల గురించి విన్నాం. అవి ఏదో మూటగట్టుకుందామని స్వలాభంతో చేసేవే. కానీ అమెరికాలో స్థిరపడిన కొందరు భారతీయ వైద్యులు చేస్తున్న మెడికల్ యాత్ర చాలా ప్రత్యేకం. దేశం కోసం స్వలాభాన్ని కొంత మానుకుని వైద్య సేవల్ని అందించేందుకు ఏటా యాత్ర చేస్తున్నారు. వేలాది మందికి చికిత్సనందిస్తున్నారు. అలా ఈ ఏడాది ఫిబ్రవరిలో శాస్త్రీయ వైద్యం జాడే తెలీని తూర్పు గుజరాత్ మారుమూల అటవీ ప్రాంతాల్లో మెడికల్ యాత్ర టీమ్ వచ్చింది. భగత్‌లనే నాటు వైద్యులపైనే ఆధార పడిన అక్కడి ప్రజలకు శాస్త్రీయ వైద్యం పరిచయం చేసిందా జట్టు. సుమారు 10 పల్లెల్లో వారం రోజుల పాటు క్యాంప్ వేసి దాదాపు 4 వేల మందికి వైద్యాన్ని అందించింది. ఆ టీమ్‌లో ఒక వైద్యురాలైన క్లీవ్‌ల్యాండ్‌లో పనిచేసే తుమ్మల రమ్యశ్రీ ఒకరు. ఆమె తన వంతుగా 400 మందికి వైద్య సాయం చేసింది. ఇలాగైనా దేశానికి రుణం తీర్చుకున్నట్టే అని చెబుతోన్న ఆ యువతిది హైదరాబాద్.

విదేశాల్లో స్థిరపడాలని ఎగిరిపోయే వైద్య విద్యార్థులు ఉంటారు. కానీ కొందరు మెడికల్ యాత్రల పేరిట అప్పుడప్పుడూ తిరిగి భారత్ వచ్చి కుగ్రామాల్లో ఉచిత వైద్య సేవల్ని అందిస్తున్నారు. వారిలో తుమ్మల రమ్యశ్రీ ఒకరు. అమెరికాలోని ఓహియో నుంచి వచ్చిన 15 మంది వైద్య బృందంలో ఆమె ఒకరు. ఎన్నారైల్లోని కొందరు వైద్యులు ఓ గొడుగు కిందకు వచ్చి మెడికల్ యాత్ర పేరిట దేశానికి సేవ చేస్తున్న బృందమది.

ప్రజల వద్దకే ప్రాణదాతలు

మెడికల్ యాత్ర బృందం గత పదహారేళ్లుగా దేశంలోని ఒక్కో రాష్ట్రాన్ని ఎంచుకుని వైద్యం జాడ లేని మారుమూల గ్రామాల్లో ఏటా వారం రోజుల పాటు క్యాంపులు నిర్వహిస్తోంది. ఈ బృందంలో విదేశీయులతో పాటు స్థానిక డాక్టర్లు, వైద్య వలంటీర్లు కూడా పాల్గొంటారు. ఇప్పటి వరకు కొన్ని వేల మందికి వైద్య సాయం అందించిన ఆ బృందం క్యాన్సర్, థైరాయిడ్ సమస్యలు, గుండె పోటు వంటి ప్రాణాంతక రుగ్మతల్ని గుర్తించేందుకు ఆ గ్రామాల వద్దకే ఈసీజీ, స్కానర్లు, ల్యాబ్‌ల్ని తీసుకొస్తుంది. మమ్మోగ్రఫీ, సోనోగ్రఫీ, ఎమ్మారైలతో ఉన్న మెడికల్ ల్యాబ్‌కు అనుకూలంగా ఓ బస్‌ను రూపొందించుకుని ఉన్న చోటనే పరీక్షల్ని నిర్వహించి రిజల్ట్స్‌ను చూస్తుంది. ఆ బస్‌కు 'సంజీవని రథ్' అని పేరు పెట్టుకుంది. గుజరాత్ క్యాన్సర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అహ్మదాబాద్ ఈ బస్సును రూపొందించింది. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉన్నతాసుపత్రుల్లో చికిత్స అందేలా చూస్తోంది. ఈ తరహా మెడికల్ యాత్రల వల్ల చాలా కుటుంబాలు నిలబడుతున్నాయి. వ్యాధుల్ని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్సనందించడం వల్ల ఆరోగ్యపరంగానే కాక ఆర్థికంగానూ పెద్ద మేలు చేసినట్టే. ఇండియన్ ఫిజీషియన్స్ ఆఫ్ నార్త్ ఓహియో అనే పేరిట 1983లో ఓ గొడుగు కిందకు వచ్చిన ఈ ఎన్నారై వైద్య బృందంలో సుమారు 300 మంది పని చేస్తున్నారు. 1999 ఒడిశా తుఫాన్, 2001 గుజరాత్ భూకంప సమయంలో సాయానికి వచ్చిందీ వైద్యుల బృందం. ఇక్కడే కాదు అమెరికాలోనూ ఉచిత సేవల్ని అందిస్తోంది. ఏటా రెండు సార్లు హెల్త్ ఫెయిర్లు నిర్వహిస్తూ వందలాది మందికి చికిత్సనందిస్తోంది. 2001 సెప్టెంబర్ 11 దాడులపుడు కూడా బాధితుల్ని ఆదుకుంది. కత్రినా, రీటా తుఫానులపుడూ చేదోడుగా నిలిచింది. మెడికల్ యాత్రలే కాక తుఫాన్, సునామీ, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలపుడు కూడా ఒక్క తాటిన నడుస్తూ బాధితులకు సేవ చేస్తుంటుందీ బృందం. కేవలం భారతే కాక సంక్షోభ ప్రాంతాలైన హైతీ, డొమినిక్ రిపబ్లిక్, ఉగాండా, కెన్యా, బురుండీ వంటి దేశాల్లోనూ వైద్య సాయం చేసింది. భారత్‌లోని కచ్‌లో బిడాదా సర్వోదయ ట్రస్ట్ ద్వారా ఏటా 1200 గ్రామాల ప్రజలకు శస్త్రచికిత్సలు తదితర వైద్య సాయం అందిస్తోంది. గతంలో గాండెవీలో వీరందించిన ఉచిత వైద్యం కోసం 450 కి.మీ. దూరం నుంచి వచ్చిన హృద్రోగికి విజయవంతంగా ఆపరేషన్ పూర్తయ్యాక వారి కుటుంబ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, కేరళ, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో దాదాపు లక్షా యాభై వేల మందికి సేవలందించింది. కేవలం వైద్య సహాయమే కాకుండా స్థానిక వైద్య విద్యార్థులు, నర్సులకు అధునాతన వైద్య వివరాలు, మెళకువలు, ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించే కార్యక్రమాల్ని కూడా నిర్వహిస్తోంది. గత క్యాంపుల్లో తెలుగు వారెందరో పాల్గొన్నారు. ఈ సారి యాత్రకు తుమ్మల రమ్యశ్రీ వచ్చారు. ఏదో రకంగా దేశం పట్ల బాధ్యత చూపుతోన్న ఇలాంటి మెడికల్ యాత్రల్ని స్వాగతించాలి. ✦



స్టార్

కొలవెరి డీతోనే అనిరుధ్‌ను మళ్లీ మళ్లీ పరిచయం చేయాల్సినంతగా పాపులరై పోయిందా క్రేజీ సాంగ్. ఇంగ్లిపీస్‌ను పీస్ పీస్ చేస్తూ సాగిపోయే ఆ పాట యువతరానికి అంతగా దగ్గరవడానికి కారణం తప్పదన్నట్టు ఆంగ్లంతో తిప్పలు పడుతున్న కుర్రకారు కెరీర్లే. అయితే ఓ సిస్టమ్‌లో పడిపోవడం, బౌండరీల్లో బతికేయడం బొత్తిగా ఇష్టముండదీ కుర్ర మ్యూజిక్ కంపోజర్‌కు. ఇప్పటి వరకు స్క్రిప్ట్‌ను చెబితే విని కంపోజ్ చేసుకున్న చిత్రాలు ఒకటో రెండో. మిగతావన్నీ ముందే రూపొందిం చుకుని స్టోరేజీలో సర్దుకున్నవే. అనిరుధ్ ఇప్పుడు అంతర్జాతీయ క్రేజ్ కోసం ఓ పాప్ ఆల్బమ్ చేపట్టే ఆలోచనలో ఉన్నాడు. ఇక కొల వెర్రి ఎంతెక్కువవుతుందో.



కొలవెరి డీ 'అని'

- అనిరుధ్‌కు ఆ రోజు మూడ్ ఎలా ఉంటే అలా దానికి తగ్గట్టు సరిగమలు సాగిపోతాయి. జలుబు చేస్తే ఒకలా, ఆకలేస్తే ఒకలా ఇలా సందర్భానికి తగ్గట్టు పాటల్ని ఎత్తుకుంటాడు. కొన్ని సినిమాల్లో అతడి పాటలకు తగ్గట్టు స్క్రిప్ట్‌లో చిన్నచిన్న మార్పులు చేసుకునేంతగా అవి కట్టిపడేస్తాయి. నయన్ తార చిత్రం 'నేను రౌడీనే' (తమిళంలో నాన్ రౌడీ దాన్) చిత్రంలో కేవలం రెండే పాటలనుకున్నాక



అనిరుధ్ ట్యూన్స్ చూసి ఇంకొన్ని పాటల్ని ఎక్కించేశారు.
- ఇలాంటి పాటలు వందల్లో అతడి కంప్యూటర్‌లో భద్రంగా ఉన్నాయి. అయినా ఏ రోజూ హార్డ్ వర్క్‌ను పక్కన పెట్ట బుద్ధి కాదట అనిరుధ్‌కు. ఓ కొత్త పాట అందుకోకుంటే తన ఆర్ట్ వర్క్ ఖాళీ ఐనట్టు ఫీల్ అవుతాడట.
- సినీ గీతాల్ని సృజించే పనే కాదు మన డీఎస్పీ (దేవిశ్రీ)లా లైవ్ షోలు, కాన్సెర్ట్‌లు ఇచ్చేస్తూ తెగ పాపులర్ అవుతున్నాడు. ఈ మధ్యే కెనడా, మలేషియాలో ఇచ్చిన ప్రదర్శనలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు చెన్నై, దుబాయ్, లండన్‌లో స్టేజ్‌ను హీటెక్కించనున్నాడు.
- ఓ రకంగా ఈ కాన్సెర్ట్‌లు అనిరుధ్‌కు గొప్ప మేలే చేస్తున్నాయి. అతడిలోని ఇంట్రావెర్ట్‌ను మూలకు తోసేస్తూ అందరి మధ్య కేరింతలు కొట్టిస్తున్నాయి. ఒక్కపుడు ఎవరితో పెద్దగా కలవడని ముద్ర పడినా ఇప్పుడు మాత్రం గ్యాంగ్‌ల్లో చొరబడే అవకాశం వస్తోంది.
- మూడేళ్లపుడు పియానో మీద వేళ్లు చకచకా కదలించే సరికి తల్లిదండ్రులు వెన్ను తట్టారు. అలా అని విద్యను నిర్లక్ష్యం చేయలేదు అనిరుధ్. ఇంటర్ తర్వాత సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ వచ్చినా తన ప్రాణమైన సంగీతానికే అంకితమయ్యాడు. అలా చిన్న వయసులోనే (19 ఏళ్లు) సంగీత దర్శకుడిగా పనిచేసి అందర్నీ ఆకట్టుకున్నాడు.
- సినీ పరిచయాలున్న కుటుంబం నుంచే వచ్చినా సాంప్రదాయక కుటుంబం కావడంతో అనిరుధ్‌కు లైన్ క్లియర్ కాలేదు. ఇంట్లో చిన్నచిన్న గొడవలు, పేచీలుండేవి. ఆ సమయంలో ధనుష్, శృతి హాసన్‌ల తమిళ్ '3' చిత్రంలో అవకాశం రావడం ఒక ఎత్తు. కొలవెరి డీ అంటూ కుర్రకారు ఊగిపోవడం మరో ఎత్తు. అంతే సినీ కెరీర్‌కు కుటుంబం అడ్డు చెప్పలేదు.
- కొలవరి డీతో వచ్చిన క్రేజ్‌కు జ్వరం పట్టినట్టు అనిపించి ఆ హైప్‌ను కాపాడుకునేందుకు జయాపజయాలకు అతీతంగా ఉండే చిన్న సినిమా 'ఎథిర్ నీచల్' చేశాడు. అదో గొప్ప మలుపునిచ్చింది. ఆ తర్వాత 'వణక్కం చెన్నై' మరో హిట్. ఇక ఊపిరి సలుపని ఆఫర్లతో తెగ బిజీ అయిపోయాడు. సింగర్‌గాను క్లిక్ అయ్యాడు. వేరే సంగీత దర్శకుల పాటలకు కూడా గాత్రాన్ని అందించాడు. 'షూట్ ది కురువి', 'హే మామా...' అలా వచ్చినవే. వీటిని సరదాగే చేస్తుంటాడు. డబ్బుల లెక్కలొద్దంటాడు.
- సినిమాలు, కచేరీలే కాదు సింగిల్స్‌తోను హిట్‌లు కొడుతున్నాడు.
- వాలెంటైన్స్ డే సందర్భంగా వచ్చిన 'అవాలుకేనా' పక్షం రోజుల్లో మిలియన్ వ్యూలను దాటేసింది యూట్యూబ్‌లో. గ్రామీ అవార్డులను కొల్లగొట్టిన స్క్రిల్లెక్స్, డిప్లోతో కలిసి పాప్ ఆల్బమ్ రూపొందించే పనిలో ఉన్నాడు. వీళ్లు కుర్ర పాప్‌స్టార్ జస్టిన్ బీబర్ విజయంలో కీలకమైనోళ్లు.

కార్టూన్ పంచ్



నవ్వుల్- పువ్వుల్

హోం వర్క్

టీచర్ ఒరేయ్ నీ హోం వర్క్‌లో ఇన్ని తప్పులున్నాయేమిటిరా..?

గోపి: సారీ మేడం తప్పులు రాయనని చెప్పి డబ్బులు తీసుకుని కూడా తప్పులు రాసింది మేడమ్.

టీచర్ : ఎవర్రా!

గోపి: మా అన్నయ్య మేడం

నల్లబల్లి-తెల్లబల్లి

టీచర్: చింటూ చక్కటి కవితొకటి చెప్పరా..అని అడిగింది టీచర్.

చింటూ: అమ్మకొడితే తెల్లబల్లి..నాన్న కొడితే నల్లబల్లి..నేను కొడితే బహుబలి..

టీచర్ : నేను కొడితే నీ నడుము బలి కూర్చోవోయ్ బడుద్ధాయ్

లావు

రాధిక: ఏమండీ! నేను లావుగా ఉన్నానా ?

ప్రదీప్: అవును.

రాధిక: లావుగా ఉన్నానని అనడానికి నోరు ఎలా వచ్చిందండీ!

రాధిక: ఏవండీ నేన లావుగా ఉన్నానా!

ప్రదీప్: లేదు

రాధిక: మీరెప్పుడు నిజం చెప్పారూ!

ప్రదీప్: అవునన్నా నమ్మవు. కాదన్నా ఒప్పుకోవు. ఇంక ఏం చెప్పి చావను?!

సెల్ఫీ

మన శీను రైల్వే ఎంక్వయిరీ దగ్గరికి వెళ్ళాడు.

శీను: ఏమండీ, తిరుమల ఎక్స్‌ప్రెస్ ఎన్ని గంటలకు వస్తుంది.

క్లర్క్: 3 గంటలకి

శీను: త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్ ఎన్నింటికి వస్తుంది?

క్లర్క్: 3.30 గంటలకి వస్తుంది

శీను: మరి బెంగళూరు పాసింజర్ ఎన్నింటికి వస్తుంది?

క్లర్క్: 4 గంటలకి వస్తుంది? ఇంతకీ నువ్వు ఎక్కడకి వెళ్ళాలయ్యా బాబూ?

శీను: ఎక్కడికీ వెళ్ళనవసరం లేదు. రైలుతో సెల్ఫీ తీసుకుందామని........

టీ'-20

ప్రపంచంలోని క్రికెట్ అభిమానులు ఎక్కువగా ఉన్న దేశం భారత్.. మరో ప్రపంచ కప్‌కు ముస్తాబైంది. ఆరవ టీ-20 ప్రపంచ సమరానికి కౌంట్ డౌన్ ప్రారంభమైంది. సిక్సర్ల వెల్లువ, బౌండరీల వరద, పరుగుల వర్షంతో రాబోతోన్న టోర్నీకి క్రికెట్ ప్రపంచం శతకోటి కళ్ళతో ఎదురు చూస్తోంది. పురుషులతో పాటు మహిళా టీ-20 ప్రపంచకప్‌కు సైతం భారత్ ఆతిథ్యమిస్తోంది.

- చొప్పరపు కృష్ణారావు
8498084018

క్రికెట్ కేవలం మూడక్షరాల ఆట మాత్రమే కాదు. భారత ఉపఖండ దేశాలలోని కోట్లాది మంది అభిమానులపై మూడు రకాల ఫార్మాట్లతో ముప్పేట దాడి చేస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సయ్యాట. ప్రతి ఏడాది జరిగే ద్వైపాక్షిక టెస్ట్, వన్డే సిరీస్‌లతోపాటు నాలుగేళ్లకోసారి వన్డే ప్రపంచకప్ అదీ చాలదన్నట్లుగా రెండేళ్లకోసారి జరిగే ధూమ్ ధామ్ టీ-20 ప్రపంచకప్ లాంటి టోర్నీలతో 123 కోట్ల భారత ప్రజల సమ్మోహక క్రీడగా మారిపోయింది. పిల్లల నుంచి పెద్దల వరకూ, పురుషుల నుంచి మహిళల వరకూ అన్ని వర్గాల వారినీ అలరిస్తున్న ఏకైక క్రీడ.. క్రికెట్ అన్నా ఆశ్చర్యం లేదు.

అతిపెద్ద క్రికెట్ మార్కెట్...

ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ మార్కెట్‌గా వున్న భారత్ గడ్డపైన సాధ్యమైనన్ని క్రికెట్ టోర్నీలు నిర్వహించడమే వ్యూహంగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) పావులు కదుపుతోంది. అందులో భాగంగానే 2016 ఐసీసీ టీ-20 ప్రపంచకప్‌కు భారత్ వేదికగా రంగం సిద్ధమైంది.

సాంప్రదాయక క్రికెట్ అభిమానులకు ఆత్మానందాన్ని కలిగించే ఐదు రోజుల టెస్ట్ మ్యాచ్‌లు, ఒక్క రోజులో అటో ఇటో తేలిపోయే ఇన్‌స్టంట్ వన్డే క్రికెట్ పోటీలు.. వాటికి కొనసాగింపుగా నవతరాన్ని అలరించడానికి వచ్చినవే ధూమ్ ధామ్ టీ-20 క్రికెట్ పోటీలు.

మూడున్నర గంటల్లో.. 120 బాల్స్.. ఓ ఇన్నింగ్స్‌గా ముగిసిపోయే సిక్సర్ల హోరు, బౌండ్రీల జోరు, పరుగుల వెల్లువలా సాగే టీ-20 క్రికెట్ అంటే నేటి తరానికి ఎంతో మక్కువ. క్రికెట్ కోసం రోజంతా వృథా కాకుండా కేవలం నాలుగు గంటల సమయంలోనే ఉత్కంఠను రేపి మజాను కలిగించే ఫార్మాట్‌గా టీ-20 గుర్తింపు సంపాదించింది. టీ-20లోని జన సమ్మోహక శక్తిని గుర్తించిన

కారణంగానే ఐసీసీ రెండేళ్లకోసారి ప్రపంచ కప్ పోటీలు నిర్వహిస్తూ వస్తోంది.

2007లో తొలి టీ-20 ప్రపంచకప్

వన్డే క్రికెట్ 20వ శతాబ్దపు క్రికెట్ ఫార్మెట్‌గా గుర్తింపు తెచ్చుకొంటే టీ-20 క్రికెట్ 21వ శతాబ్దపు అభిమాన క్రీడగా దూసుకొచ్చింది. క్రికెట్ పుట్టినిల్లు ఇంగ్లీష్ కౌంటీల్లో తొలి అధికారిక టీ-20 మ్యాచ్‌ను ప్రయోగాత్మకంగా 2003 జూన్ 13న నిర్వహించారు. ఆ మ్యాచ్‌కు విశేష జనాదరణ లభించడంతో అంతర్జాతీయ స్థాయిలో ప్రవేశపెట్టాలని ఐసీసీ తీర్మానించింది.

ఆ తర్వాత రెండేళ్లకు 2005లో ఆక్లాండ్ ఈడెన్ పార్క్ వేదికగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్ల మధ్య మొట్టమొదటి అధికారిక టీ-20 అంతర్జాతీయ మ్యాచ్‌ను నిర్వహించారు. అప్పటి నుంచే టెస్ట్ హోదా పొందిన వివిధ దేశాల జట్ల మధ్య ద్వైపాక్షిక టీ-20 మ్యాచ్‌లు నిర్వహిస్తూ వచ్చారు. దక్షిణాఫ్రికా వేదికగా 2007లో నిర్వహించిన ప్రారంభ ఐసీసీ టీ-20 ప్రపంచ కప్ ఫైనల్స్‌కు చిరకాల ప్రత్యర్థులు.. ఆసియా దిగ్గజాలు టీ మిండియా, పాకిస్థాన్ చేరుకోవడంతో.. ప్రపంచ వ్యాప్తంగా ఆ మ్యాచ్ క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది.

పాక్‌తో ముగిసిన టైటిల్ సమరంలో మహేంద్ర సింగ్ ధోని నాయకత్వంలోని భారత జట్టు కేవలం 5 పరుగుల తేడాతో విజయం సాధించడం ద్వారా తొలి టీ-20 ప్రపంచకప్ చాంపియన్‌గా రికార్డుల్లో చేరింది.

2009లో ఇంగ్లండ్ వేదికగా జరిగిన రెండో టీ-20 ప్రపంచకప్ ఫైనల్స్‌కు పాకిస్తాన్, శ్రీలంక జట్లు చేరుకోగా... టైటిల్ సమరంలో శ్రీలంకను 8 వికెట్లతో పాక్ జట్టు చిత్తు చేసి విశ్వ విజేతగా నిలిచింది. ఆ తర్వాత ఏడాది కాలంలోనే కరీబియన్ ద్వీపాలు వేదికగా 2010లో మూడో ఐసీసీ టీ-20 ప్రపంచకప్‌ను నిర్వహించారు. బ్రిడ్జ్‌టౌన్ స్టేడియంలో ముగిసిన ఫైనల్లో ఇంగ్లండ్ 7 వికెట్లతో ఆస్ట్రేలియాపై సంచలన విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచింది.

2012లో జరిగిన నాలుగో ప్రపంచకప్‌కు భారత ఉపఖండ దేశం శ్రీలంక ఆతిథ్యమిచ్చింది. అయితే భారీ అంచనాలు ఏమాత్రం లేకుండా ప్రపంచకప్‌లో పాల్గొని ఫైనల్లో ఆతిథ్య శ్రీలంకను 36 పరుగులతో చిత్తు చేయడం ద్వారా వెస్టిండీస్ ప్రపంచ ట్రోఫీ అందుకుంది.

2014లో 5వ ఐసీసీ టీ-20 ప్రపంచకప్‌ను బంగ్లాదేశ్ వేదికగా నిర్వహించారు. ఢాకా వేదికగా ముగిసిన టైటిల్ సమరంలో భారత్‌పై శ్రీలంక ఆరు వికెట్ల అలవోక విజయం సాధించడం ద్వారా విశ్వవిజేత కాగలిగింది.

మొత్తం మీద మొదటి ఐదు ప్రపంచకప్ టోర్నీల్లో ఆసియా క్రికెట్ దిగ్గజాలు టీమిండియా, పాకిస్తాన్, శ్రీలంక జట్లు విజేతలుగా నిలవడం ఓ అరుదైన ఘనతగా మిగిలిపోతుంది.

2007 నుంచి 2014 వరకూ జరిగిన ఐదు ప్రపంచకప్ టోర్నీల్లో వందలకొద్దీ ఆటగాళ్ళు పాల్గొన్న బ్యాటింగ్‌లో మహేల జయవర్థనే, బౌలింగ్‌లో లాసిత్ మలింగ టాప్ స్టార్లుగా నిలిచారు. మహేల జయవర్థనే మొత్తం 1016 పరుగులు సాధిస్తే.. యార్కర్ల కింగ్ లాసిత్ మలింగ బౌలింగ్‌లో 38 వికెట్లు పడగొట్టాడు. ఈ ఇద్దరూ శ్రీలంక జట్టు సభ్యులే కావడం మరో విశేషం.

భారత్ వేదికగా తొలి టీ-20 ప్రపంచకప్

ఇప్పటికే పలుసార్లు వన్డే ప్రపంచ కప్ పోటీలకు వేదికగా నిలిచిన భారత క్రికెట్ బోర్డు 2016 టీ-20 ప్రపంచ కప్ టోర్నీకి మాత్రం తొలిసారిగా ఆతిథ్యమిస్తోంది.

మార్చి 8 నుంచి 14 వరకూ ఎనిమిది దేశాల క్వాలిఫైయింగ్ రౌండ్ల పోటీలు, మార్చి 15 నుంచి పది జట్లతో రెండు గ్రూపులుగా సూపర్-10 పోటీలను నిర్వహిస్తారు.

టెస్ట్ హోదా పొందిన భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, శ్రీలంక, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్లు నేరుగా ఫైనల్ రౌండ్లో పాల్గొంటాయి. ఫైనల్ రౌండ్లో రెండు స్థానాల కోసం జరిగే క్వాలిఫైయింగ్ రౌండ్లలో

బంగ్లా క్రికెటర్ల రికార్డు

ఆరు ప్రపంచకప్ టోర్నీల్లోను పాల్గొన్న అత్యధిక క్రికెటర్ల రికార్డును బంగ్లాదేశ్ జట్టు సొంతం చేసుకొంది. టీ-20 ప్రపంచకప్ చరిత్రలో ఇప్పటి వరకూ జరిగిన ఐదు టోర్నీల్లో పాల్గొన్న ముష్రఫే మొర్తాజా, ముష్ఫికర్ రహీం, షకీబుల్ హసన్, తమీమ్ ఇక్బాల్, మహ్మదుల్లా ..2016 ప్రపంచకప్‌లో పాల్గొనే తమ జాతీయ జట్టులో చోటు సంపాదించారు.

ఆరవ ప్రపంచకప్‌లో పాల్గొంటున్న ఇతర దేశాల క్రికెటర్లలో వెస్టిండీస్‌కు చెందిన డ్వానే బ్రావో, క్రిస్ గేల్, వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ దినేశ్ రామ్‌దిన్, న్యూజిలాండ్‌కు చెందిన నేథన్ మెకల్లమ్, రాస్ టేలర్, శ్రీలంక ఓపెనర్ తిలకరత్నే దిల్షాన్, ఓపెనింగ్ బౌలర్ లాసిత్ మలింగ, సౌతాఫ్రికా ఆటగాళ్ళలో ఏబి డివిలియర్స్, డుమ్నీ, పాకిస్థాన్ కెప్టెన్ కమ్ ఆల్ రౌండర్ షాహిద్ అఫ్రిదీ, ఆస్ట్రేలియా సూపర్ ఆల్ రౌండర్ షేన్ వాట్సన్ ఉన్నారు. ఏది ఏమైనా ఆరు ప్రపంచ కప్ టోర్నీల్లో పాల్గొనడం అంటే మాటలా మరి.





ప్రపంచ కప్ వేదికలు

స్టేడియం నగరం	సీటింగ్	సామర్థ్యం
ఈడెన్ గార్డెన్స్	కోల్‌కతా	66,349
చిన్నస్వామి సి.ఎస్.	బెంగళూరు	40,000
వాంఖడే	ముంబై	32,000
ఫిరోజ్‌షా కోట్లా	ఢిల్లీ	40,715
హిమాచల్ సి.ఎస్.	ధర్మశాల	23,000
పంజాబ్ సి.ఎస్.	మొహాలీ	26,950
విదర్భ సి.ఎస్.	నాగపూర్	45,000

జట్లు - గ్రూపులు

గ్రూప్:ఏ

శ్రీలంక, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఇంగ్లండ్, క్వాలిఫైయర్ గ్రూప్-2 విన్నర్స్

గ్రూప్:బి

భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, ఆస్ట్రేలియా క్వాలిఫైయర్ గ్రూప్-1 విన్నర్

బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, ఐర్లాండ్, ఒమన్, ఆఫ్ఘనిస్తాన్, స్కాట్లాండ్, హాంకాంగ్ జట్లు అమీతుమీ తేల్చుకోబోతున్నాయి.

సూపర్-10 రౌండ్లో తలపడే మొత్తం పది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. పూల్-ఏలో శ్రీలంక, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఇంగ్లండ్‌తో పాటు క్వాలిఫైయింగ్ రౌండ్లో నుంచి వచ్చిన ఒక జట్టు తలపడతాయి.

పూల్-బీ లీగ్‌లో ఆతిథ్య టీమిండియా, న్యూజిలాండ్, పాకిస్తాన్, ఆస్ట్రేలియా లాంటి మేటి జట్లతోపాటు ఓ క్వాలిఫైయర్ జట్టు పోటీ పడుతుంది.

ఇదీ టీమిండియా కార్యక్రమం

2016 టీ-20 ప్రపంచకప్‌లో హాట్ ఫేవరట్ హోదాలో బరిలోకి దిగుతున్న టీమిండియా నాగపూర్ విదర్భ క్రికెట్ స్టేడియం వేదికగా మార్చి 15న న్యూజిలాండ్‌తో తన ప్రారంభ మ్యాచ్ ఆడుతుంది. మార్చి 19న కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే పోటీలో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను ఢీకొంటుంది. బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా మార్చి 23న జరిగే పోటీలో క్వాలిఫైయర్స్ ద్వారా అర్హత సాధించిన జట్టుతో ఆడుతుంది. మార్చి 27న మొహాలీలోని పంజాబ్ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగే ఆఖరి గ్రూప్ పోటీలో ఆస్ట్రేలియాను టీమిండియా ఢీ కొంటుంది.

మార్చి 30న న్యూఢిల్లీ ఫిరోజ్ షా కోట్లా మైదానం వేదికగా తొలి సెమీ ఫైనల్స్, మార్చి 31న ముంబై వాంఖెడే స్టేడియం వేదికగా రెండో సెమీ ఫైనల్స్ నిర్వహిస్తారు.

ఏప్రిల్ 3న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో టైటిల్ సమరం జరుగుతుంది. ప్రపంచకప్ గ్రూప్ లీగ్ నుంచి నాకౌట్ వరకూ జరిగే మొత్తం 35 మ్యాచ్‌ల కోసం కోల్‌కతా, బెంగళూరు, ముంబై, ధర్మశాల, న్యూఢిల్లీ, మొహాలీ, నాగపూర్ అంతర్జాతీయ స్టేడియాలను సకల హంగులతో నిర్వాహక సంఘం సిద్ధం చేసింది.



ముగ్గురూ ముగ్గురే...

దక్షిణాఫ్రికా గడ్డపై ముగిసిన ప్రారంభ ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో సభ్యులుగా ఉన్న మహేంద్ర సింగ్ ధోనీ, యువరాజ్ సింగ్, రోహిత్ శర్మ ప్రపంచకప్‌లో డబుల్ హ్యాట్రిక్ పూర్తి చేయటానికి సిద్ధమవుతున్నారు. 2007, 2009, 2010, 2012, 2014 ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొన్న ఈ ముగ్గురు మొనగాళ్ళు 2016 ప్రపంచకప్‌లో సైతం పాల్గొనడం ద్వారా అరుదైన రికార్డు నెలకొల్పబోతున్నారు.

హాట్ ఫేవరెట్ టీమిండియా

భారత్ వేదికగా తొలిసారిగా జరుగుతున్న టీ-20 ప్రపంచకప్‌ను ఆతిథ్య టీమిండియా గెలుచుకోవడం ఖాయమని క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు. అంతేకాదు ప్రపంచకప్‌కు సన్నాహకంగా ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో గెలుచుకున్న టీమిండియా ఆ తర్వాత శ్రీలంకతో జరిగిన సిరీస్‌ను సైతం 2-1తో సొంతం చేసుకొంది. బంగ్లాదేశ్ వేదికగా ముగిసిన ప్రారంభ టీ-20 ఆసియా కప్‌లో సైతం ధోనీ సేన సత్తా చాటుకొంది. దానికి తోడు స్థానబలం కూడా టీమిండియాకు వెయ్యేనుగుల బలంగా మారింది.

టీమిండియా తర్వాత ఆస్ట్రేలియా, వెస్టిండీస్, ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్లకు విజయావకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. వ్యక్తిగతంగా చూస్తే బ్యాటింగ్‌లో టీమిండియా డాషింగ్ ఓపెనర్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, దక్షిణాఫ్రికా కెప్టెన్ ఏబీ డివిలియర్స్, ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్, వెస్టిండీస్ సూపర్ హిట్టర్ క్రిస్ గేల్‌తోపాటు యాండ్లీ రస్సెల్, నోయిన్ మోర్గాన్, అలెక్స్ హేల్స్, కోరీ యాండర్సన్, ల్యూరీ రోంచీ లాంటి ఆటగాళ్ల విధ్వంసకర బ్యాటింగ్‌తో పరుగుల సునామీ సృష్టించే అవకాశాలున్నాయి.

ఇక బౌలింగ్ విభాగంలో.. భారత్ పేస్ బౌలర్లు ఆశీష్ నెహ్రా, బుమ్రా, పాక్ యువ ఫాస్ట్ బౌలర్లు మహ్మద్ అమీర్, వహాబ్ రియాజ్, ఆస్ట్రేలియా మెరుపు ఫాస్ట్ బౌలర్లు హేజిల్ వుడ్, జాన్ హేస్టింగ్స్, కివీ స్వింగ్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్, ఆడం మిల్నీ, సఫారీ ఫాస్ట్ బౌలర్ రబాడా, డేల్ స్టెయిన్ చెలరేగడం ఖాయంగా కనిపిస్తోంది.

స్పిన్ బౌలింగ్ విభాగంలో భారత స్పిన్ జోడి రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, సౌతాఫ్రికా లెగ్ స్పిన్నర్ ఇమ్రాన్ తాహీర్, ఇంగ్లండ్ లెగ్ స్పిన్నర్



పురుషుల ప్రపంచకప్ విజేతలు

సంవత్సరం	వేదిక	విజేత	రన్నరప్
2007	దక్షిణాఫ్రికా	భారత్	పాకిస్తాన్
2009	ఇంగ్లండ్	పాకిస్తాన్	శ్రీలంక
2010	వెస్టిండీస్	ఇంగ్లండ్	ఆస్ట్రేలియా
2012	శ్రీలంక	వెస్టిండీస్	శ్రీలంక
2014	బంగ్లాదేశ్	శ్రీలంక	భారత్

మహిళా ప్రపంచకప్- విజేతలు

2009	ఇంగ్లండ్	ఇంగ్లండ్	న్యూజిలాండ్
2010	వెస్టిండీస్	ఆస్ట్రేలియా	న్యూజిలాండ్
2012	శ్రీలంక	ఆస్ట్రేలియా	ఇంగ్లండ్
2014	బంగ్లాదేశ్	ఆస్ట్రేలియా	ఇంగ్లండ్

ఆదిల్ రషీద్, మొయిన్ అలీ, పాక్ స్పిన్ జోడీ షాహీద్ అఫ్రిదీ, మహ్మద్ హఫీజ్, షకీబుల్ హసన్, శ్రీలంక వెటరన్ స్పిన్నర్ రంగన్ హెరాత్ తమ స్పిన్ మ్యాజిక్‌తో కీలకం కానున్నారు.

¤ ¤ ¤ ¤ ¤

మహిళలకూ ప్రపంచకప్

ధూమ్ ధామ్ టీ-20 క్రికెట్ ఫార్మాట్‌లో ... భారత్ వేదికగా పురుషులకు ఆరవ ప్రపంచకప్ నిర్వహిస్తుంటే మహిళా క్రీడాకారిణులేమో ఐదవ ప్రపంచకప్ సమరం కోసం సిద్ధమవుతున్నారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి ఆధ్వర్యంలో పురుషులకు, మహిళలకూ ఏకకాలంలో ఒకే విధంగా 2016 ప్రపంచకప్‌ను నిర్వహిస్తున్నారు.

మార్చి 15 నుంచి ఏప్రిల్ 3 వరకూ జరిగే మహిళా టోర్నీని రౌండ్ రాబిన్ లీగ్ కమ్ నాకౌట్‌గా నిర్వహిస్తున్నారు.

10 జట్లు, 23 మ్యాచ్‌లు...

2016 మహిళా ప్రపంచకప్‌లో.. మూడుసార్లు విజేత ఆస్ట్రేలియా, మాజీ చాంపియన్ ఇంగ్లండ్‌తో సహా మొత్తం పది దేశాల జట్లు తలపడుతున్నాయి.

రౌండ్ రాబిన్ లీగ్‌లో 20 మ్యాచ్‌లు, నాకౌట్ రౌండ్లో మూడు మ్యాచ్‌లకు దేశంలోని ఆరు వేదికలు ఆతిథ్యమిస్తున్నాయి.

ధర్మశాలలోని హిమాచల్‌ప్రదేశ్ క్రికెట్ స్టేడియంలో రెండు మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మొహాలీలోని పంజాబ్ క్రికెట్ స్టేడియంలో మూడు గ్రూపు మ్యాచ్‌లు, ఢిల్లీ ఫిరోజ్ షా కోట్లా స్టేడియంలో ఐదు గ్రూపు మ్యాచ్‌లతో పాటు సెమీ ఫైనల్స్, బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో నాలుగు గ్రూపు పోటీలు నిర్వహిస్తారు.

నాగపూర్ విదర్భ క్రికెట్ స్టేడియంలో రెండు,



అరుదైన క్రికెటర్లు

క్రికెటర్లకు జాతీయ జట్టులో చోటు సంపాదించడం ఓ కల. ప్రపంచ కప్‌లో ఒక్కసారి పాల్గొన్నా జీవితం ధన్యమైనట్లే అని భావిస్తారు. అయితే ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఆరు ప్రపంచ కప్‌ల్లో పాల్గొంటే ఆ మజాయే వేరు. 2007 ప్రారంభ టీ-20 ప్రపంచ కప్ నుంచి 2016 ప్రపంచ కప్ వరకూ వివిధ దేశాలకు చెందిన 19 మంది క్రికెటర్లు వరుసగా ఆరో ప్రపంచకప్‌కు సిద్ధమవుతున్నారు.

క్రీడలు ఎన్నో రకాలు అయితే మిగిలిన క్రీడలన్నింటికీ భిన్నమైనది క్రికెట్ మాత్రమే. 2007 ప్రపంచకప్ వరకూ వరుసగా ఐదు టోర్నీల్లో పాల్గొన్న వివిధ దేశాలకు చెందిన 19 మంది క్రికెటర్లు 2016 ప్రపంచకప్‌కు సైతం సిద్ధమవుతున్నారు.



చెన్నై చెపాక్ స్టేడియంలో నాలుగు గ్రూపు మ్యాచ్‌లు జరుగుతాయి.

మార్చి 30న జరిగే తొలి సెమీఫైనల్స్‌కు ఢిల్లీ, 31న జరిగే రెండో సెమీఫైనల్స్‌కు ముంబై, ఏప్రిల్ 3న జరిగే టైటిల్ సమరానికి కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ వేదికలుగా ఉంటాయి.

రెండు గ్రూపులుగా సమరం...

మొత్తం పది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-ఏ లీగ్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, ఐర్లాండ్ పోటీపడతాయి.

గ్రూప్-బీ లీగ్‌లో ఆతిథ్య భారత్, ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ అమీతుమీ తేల్చుకోబోతున్నాయి.

మిథాలీరాజ్ నాయకత్వంలోని భారత జట్టు మార్చి 15న తన తొలి మ్యాచ్‌ను బెంగళూరు వేదికగా బంగ్లాదేశ్‌తో ఆడుతుంది. మార్చి 19న ఢిల్లీ వేదికగా పాకిస్తాన్, మార్చి 22న ధర్మశాలలో ఇంగ్లండ్‌తో, మార్చి 27న మొహాలీ వేదికగా వెస్టిండీస్‌తో భారత జట్టు మిగిలిన మ్యాచ్‌లు ఆడుతుంది.

హాట్ ఫేవరెట్‌గా ఆస్ట్రేలియా..

2009లో ఇంగ్లండ్ వేదికగా ముగిసిన ప్రారంభ మహిళా ప్రపంచకప్ నుంచి 2014లో బంగ్లాదేశ్ వేదికగా ముగిసిన నాలుగో ప్రపంచకప్ వరకూ ఆస్ట్రేలియా జట్టు మూడు సార్లు విజేతగా నిలిచింది. 2009లో మాత్రం ఇంగ్లండ్ టైటిల్ గెలుచుకుంది.

ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ప్లేయర్‌గా రికార్డు ఇంగ్లండ్‌కు చెందిన చార్లొట్ ఎడ్వర్డ్స్ పేరుతో ఉంది. చార్లొట్ 566 పరుగులు నమోదు చేసింది. బౌలింగ్‌లో ఎల్సీ పెర్రీ 24 వికెట్లు పడగొట్టి నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచింది.

ఇప్పటి వరకూ జరిగిన నాలుగు ప్రపంచకప్ టోర్నీల్లోనూ పాల్గొంటూ వచ్చిన భారత మహిళలు రెండు సార్లు మాత్రమే సెమీ ఫైనల్స్ చేరగలిగారు.

టీ-20 ఫార్మాట్‌లో మొత్తం 17 మ్యాచ్‌లు ఆడి 8 విజయాలు, 9 పరాజయాలతో ఉన్న భారత్ జట్టు విజయాల శాతం 47.05గా ఉంది.

మిథాలీరాజ్ నాయకత్వంలోని భారత జట్టులో వనిత, స్మృతి మంధానీ, వేదా కృష్ణమూర్తి, ఏక్తా బిస్త్, పూనం యాదవ్, అనురాధా పాటిల్, నిరంజన, జులన్ గోస్వామి, అనూజ, హర్మన్ ప్రీత్‌కౌర్, శిఖా పాండే లాంటి ప్లేయర్లు ఉన్నారు.

ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాతో ఇటీవలే ముగిసిన మూడు మ్యాచ్‌ల టీ-20 సిరీస్‌ను 2-1తో నెగ్గడంతో పాటు శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో సైతం క్లీన్‌స్వీప్ సాధించడం ద్వారా భారత జట్టు పూర్తి ఆత్మ విశ్వాసంతో ప్రపంచకప్ వేటకు దిగుతోంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్లతో పాటు భారత్ సైతం సెమీస్‌కు చేరుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పురుషుల క్రికెట్‌కు లభిస్తున్న ఆదరణ, ప్రచారం మహిళా క్రికెట్‌కు దక్కకపోవడమే ఇక్కడి అసలు విషాదం.

మార్చి 15 నుంచి ఏప్రిల్ 3 వరకూ జరిగే ఈ ధూమ్ ధామ్ టీ-20 హంగామా ఎందరు సాదాసీదా ఆటగాళ్లను హీరోలను చేస్తుందో? ఎందరు గొప్ప గొప్ప ఆటగాళ్లను జీరోలుగా మిగుల్చుతుందో? ఏ జట్టు విజేతగా నిలుస్తుందో? తెలుసుకోవాలంటే ఏప్రిల్ 3 వరకూ ఎదురు చూడక తప్పదు.

✦



అమీర్ హుస్సేన్ కాశ్మీరీ క్రీడా సంచలనం. టాప్ లెగ్ స్పిన్నర్. కుడి కాలి వాటం బౌలర్. సూపర్ హిట్టర్. ఎడమ గెడ్డం వాటం బ్యాట్స్‌మెన్. పక్కా ఆల్ రౌండర్. బాల్‌ను కాలితో త్రో చేస్తే స్టంప్‌లు కూలాల్సిందే. అందుకే జమ్ముకాశ్మీర్ రాష్ట్ర పారా జట్టుకు కెప్టెన్ అయ్యాడు. ఓ ప్రమాదంలో రెండు చేతులు పోగొట్టుకున్న అమీర్‌ను అందుకే కుడి చేతి వాటం బౌలరని, ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మెన్ అని పరిచయం చేయలేదు. ఇన్‌స్పిరేషన్ కావాలా? అయితే గాల్లో తేలుతూ కాళ్లతో బాల్‌ను విసిరే అమీర్‌ను కలవండి.



కుడి కాలి వాటం బౌలర్

అమీర్‌ది అనంత నాగ్ జిల్లాలోని వాగమ్ గ్రామం. తండ్రి బషీర్‌ది బిజ్‌బెహారా పట్టణంలో బ్యాట్లను తయారుచేసే చిత్రి వ్యాపారం (సా మిల్). ఓ రోజు అన్న కోసం అమ్మ కట్టిన క్యారేజీ తీసుకుని సా మిల్‌కు వెళ్లాడు. మిల్లులో యంత్రాలెలా పనిచేస్తున్నాయో పరిశీలనగా చూస్తుండగా కన్వేయర్ బెల్ట్‌లో అతడి చేతులు చిక్కుకుపోయాయి. ఆ సమయంలో తండ్రి అక్కడ లేడు. ఇంతలో విషయం దగ్గరలోని ఆర్మీ యూనిట్‌కు తెలిసింది. వెంటనే కొందరు సైనికులు అక్కడకు చేరుకుని అమీర్‌ను యంత్రం నుంచి జాగ్రత్తగా వేరు చేసి ఆస్పత్రికి తరలించారు. 1997 సెప్టెంబర్ 21న జరిగిన ఈ ఘటన ఆ కుటుంబానికి పెద్ద లోటును మిగిల్చింది. “వాడి చేతులు పూర్తిగా తెగిపోయాయి. ఎందుకు పనికొస్తాడు. వదిలేయరాదు. ఉన్నదంతా అమ్ముకుంటే కుటుంబం రోడ్డున పడుతుంది..” అంటూ బంధువులు వెనక్కు లాగుతున్నా తండ్రి వినలేదు. అన్నింటి కన్నా అమూల్యమైన తన అమీర్ బతకాలనేది ఆ తండ్రి తపన. వైద్యుల ఎడతెగని ప్రయత్నంతో అమీర్ ప్రాణాలు నిలబడ్డాయి కానీ రెండు చేతుల్ని భుజాల వరకూ కోల్పోయాడు. మూడేళ్ల పాటు ఆస్పత్రికే పరిమితమై కొనసాగిన చికిత్సతో బషీర్ తన సా మిల్, పొలాన్ని అమ్మేయాల్సి వచ్చింది. ఇంటికి తీసుకొచ్చాక కొన్ని నెలలు గడిచాక బడికి వెళ్లాడు. ‘నీకు చదువు అవసరం లేద'ని టీచర్ కించపరిచింది. రాత ఎలా? కనీసం పుస్తకంలోని కాగితాల్నీ తిప్పలేడుగా అంటూ తండ్రితో వాదించింది. ఇవన్నీ అమీర్‌ను యాక్సిడెంట్ కన్నా ఎక్కువ వేదనకు గురిచేశాయి. ఆ సమయంలో అమీర్‌కు కొండంత బలాన్నిచ్చింది నాన్నమ్మ ఫాజీనే. అతడితో కలసి బడికి వెళుతూ అండగా నిలిచింది. అలా అమీర్ మెల్లగా కాళ్లతోనే బట్టలు వేసుకోవడం, స్నానం చేయడం వంటి పనుల్ని చేయగలిగేవాడు. పుస్తకాలు తిప్పడమే కాదు, పెన్నును కాలి వేళ్ల మధ్య నొక్కి పట్టి రాయడం నేర్చుకున్నాడు. అతడికి తన ఫేవరెట్ అయిన క్రికెట్ గుర్తొచ్చింది. స్నేహితులంతా కేరింతలు కొడుతూ మైదానంలో ఆడుతుంటే తానేమో దూరంగా కూర్చుని చూసేవాడు. సచిన్ టెండూల్కర్‌కు వీరాభిమాని అయిన అమీర్‌కు బ్యాట్ కాదు కదా బాల్ కూడా అందుకోలేని పరిస్థితి. ఇలా రోజూ మైదానానికి వెళ్లడం మిత్రుల ఆటను దూరం నుంచి చూడటమేనా బాల్‌ను కనీసం కాలితో త్రో చేయలేనా అనే సందేహం వచ్చింది. ఇంటి దగ్గర బాల్‌ను కాలి వేళ్లతో గ్రిప్‌లోకి తీసుకోవడం విపరీతంగా అభ్యాసం చేశాడు. అలాగే బ్యాట్‌ను కూడా గెడ్డం, మెడ మధ్య తలతో బిగించి పట్టుకోవడం నేర్చుకున్నాడు. కొన్ని వేల ప్రయత్నాల తర్వాత చిట్ట చివరికి బౌలింగ్ చేయగలిగాడు. బ్యాట్‌ను ఝుళిపించగలిగాడు. ఏడో తరగతిలో ఉన్నప్పుడు క్రికెట్ మ్యాచ్‌ను టీవీలో చూడటానికి మిత్రుని ఇంటికి వెళ్లాడు. అమీర్‌ను చూడగానే ఆ ఇంటి వాళ్లు చీదరించుకుని టీవీ కట్టేసి బయటకు పొమ్మన్నారు. కానీ క్రికెటంటే ప్రాణమైన అమీర్ కిటికీకి ఉన్న చిన్న రంధ్రం నుంచి టీవీ చూస్తూ టెక్నిక్స్ పట్టేవాడు. అతడి లెగ్ స్పిన్ సగ్రున తిరిగిపోయే సరికి జట్టులో ప్రధాన బౌలరయిపోయాడు. బ్యాటింగ్‌లోను మెరుపులు అతడిని సూపర్ హీరోను చేశాయి. కాలేజీలో చేరిన తర్వాత అమీర్‌కు ఓ దశదిశా అంటూ దొరికాయి. పేదరికంతో ఇబ్బంది పడుతున్న కుటుంబ పరిస్థితి, చదువుకు కూడా తానే సంపాదించుకోవాలనే నిర్ణయానికి వచ్చాడు. అక్రోట్ కాయల్ని చెట్లపై నుంచి తెంపి వ్యాపారులకు చేరవేసేవాడు. కాలి వేళ్ల మధ్య కర్రను బిగించి చెట్టుపైకి విసిరి కాయల్ని రాల్చేవాడు. పెన్ను కూడా కొనలేని పరిస్థితి నుంచి కాలేజీ పుస్తకాలు, క్రికెట్ పరికరాలు కొనుక్కునేందుకు ఆ డబ్బు ఉపయోగపడింది. బిజ్‌బెహారా ప్రభుత్వ కళాశాల మైదానంలో అమీర్ క్రికెట్ ఆడటాన్ని చూసిన ఓ స్పోర్ట్స్ టీచర్ భావోద్వేగానికి లోనయ్యాడు. సచిన్ ఎంత నీట్‌గా లెగ్ స్క్వేర్‌లోకి బంతిని ఫ్లిక్ చేస్తాడో అంతే నేర్పుగా అమీర్ బంతిని బౌండరీ దాటిస్తాడు. అతడి లెగ్‌స్పిన్ అతడిలో గొప్ప టెక్నిక్ ఉందని గమనించిన స్పోర్ట్స్ టీచర్ పారా క్రికెట్ జట్టు గురించి అమీర్‌కు చెప్పాడు. ఆ జట్టులో అమీర్‌కు చోటు లభించింది. తొలి మ్యాచ్‌ను కేరళ జట్టుతో ఢిల్లీ వేదికగా ఆడాడు. అమీర్ ప్రదర్శనకు ఉత్తేజితులైన ప్రేక్షకులు అతణ్ని భుజాలపైకి ఎక్కించుకుని మైదానమంతా తిప్పారు. ఇప్పుడు అమీర్ అంటే ఓ ప్రేరణ. జీవితంలో ప్రతి ఎదురు దెబ్బను, ఆటంకాన్ని దాటేస్తోన్న అసామాన్యుడు... ఓ సూపర్ హ్యూమన్.

తెలుసా

టైటానిక్ పయనంలో...

టైటానిక్ సినిమాలో హీరో జాక్‌కు తన బిడ్డ కోసం కుట్టించిన స్యూట్‌నిచ్చి ఉన్నత వర్గం విందులో కూర్చోబెట్టే, ప్రమాద స్థలం నుంచి కొంత మందినే తీసుకెళుతున్న లైఫ్ బోట్‌లో ఇంకా స్థలం మిగిలే ఉందని మిగతా వారిని ఎక్కించుకోవాలని గొడవ చేసే కేతీ బేట్స్ పాత్ర మార్గరెట్ మోల్లీ బ్రౌన్ అనే మహిళది. ఆమె నిజంగానే మిగతా మహిళల సపోర్ట్‌తో క్వార్టర్ మాస్టర్ రాబెర్ట్ హిచెన్స్‌తో లైఫ్ బోట్-6ను ప్రమాద స్థలి వెనక్కు మళ్లించి మరికొందరిని రక్షించేలా చేసింది. అందుకే ఆమెను ది అన్‌సింకబుల్ మోల్లీ బ్రౌన్ అనేవారు.

టైటానిక్ చిత్రం కోసం నౌక అచ్చం ఎలా ఉంటుందో అంతే సైజులో మరో డమ్మీ నౌకను మెక్సికోలోని 40 ఎకరాల ప్లేయాస్ డి రోసారిటో వాటర్ ఫ్రంట్‌లో నిర్మించారు. చిత్రంలోని ఇంటీరియర్, గదులు, సామాన్లు, కార్పెట్లు, అలంకరణలు ఆఖరకు ప్లేట్లు, చెంచాల వరకు అన్ని అచ్చుపోసినట్టు టైటానిక్ నౌకలో వాడిన వాటికి కాపీలే. టైటానిక్ అసలు నౌకను తయారు చేసిన హార్లండ్ అండ్ వోల్ఫ్ సంస్థ సంబంధిత బ్లూప్రింట్‌లు, ఛాయాచిత్రాలు, ఇతర డాక్యుమెంట్లను దర్శకుడు కేమరూన్ టీమ్‌కు ఇచ్చింది.

నౌక రూపకర్త థామస్ ఆండ్రూస్ టైటానిక్ మునగడమనేది గణిత లెక్కల్లో మాత్రమేనని వైట్ స్టార్‌లైన్ అధినేత జె. బ్రూస్ ఇస్మేతో అన్నాడట. టైటానిక్ మునిగేపుడు అతడు ఏం చేయాలో తెలీక స్మోకింగ్ రూమ్‌లో కాసేపు గడిపాడని, ఆ తర్వాత నీళ్లలో పడినవాళ్లు మునిగిపోకుండా సాయం చేసేందుకు డెక్‌లోని కుర్చీల్ని నీటిలోకి విసిరేస్తూ కనిపించాడని ఆయన్ను చివరిసారిగా చూసినవాళ్లు చెప్పారు.

టైటానిక్‌ను గమ్యం చేర్చడమే వృత్తిలో చివరి యాత్రగా ప్రకటించిన నౌక కెప్టెన్ ఎడ్వర్డ్ జాన్ స్మిత్ లైఫ్ బోట్ బీ మునక వల్ల నీటిలో పడి గడ్డకట్టుకు చనిపోయాడని కొందరి వాదన.

ఆర్.ఎం.ఎస్. టైటానిక్‌ను బెల్‌ఫాస్ట్‌లో నిర్మించారు. యూకేలోని సౌతాంప్టన్ నుంచి న్యూయార్క్‌కు అట్లాంటిక్ మహా సముద్రంలో పయనిస్తుండగా ప్రమాద స్థలికి ముందే ఎస్.ఎస్.కాలిఫోర్నియన్ అనే నౌక ఐస్‌బెర్గ్‌ల ప్యాక్ ఉందని హెచ్చరించే ప్రయత్నం చేసిందట. టైటానిక్ మునుగుతున్నప్పుడు ఆ నౌక సమీపంలోనే ఉంది కానీ పసిగట్టలేకపోయారు దాని సిబ్బంది. అలార్మ్ లైట్స్‌ను చూసినా ఏ ఉద్దేశంతోనో

ప్రమాద విషయం తెలుసుకుని రక్షణ చర్యలకు వెళ్లిన కార్పేతియా నౌకదీ ఓ సాహస పయనమే. ఐస్ బెర్గ్‌లు, తుఫాన్ వాతావరణం, అట్లాంటిక్ సముద్రపు విపరీత పరిస్థితుల్లో బాధితుల్ని ప్రమాద ప్రాంతం నుంచి తీసుకురావడానికి 5 రోజులు పట్టింది. నౌక 1912 ఏప్రిల్ 18 రాత్రి 9.30 గంటలకు న్యూయార్క్ పైర్ 54కు చేరుకునే సమయానికి భారీ వర్షం కురుస్తోంది. బాధితులకు సంఘీభావంగా సుమారు 40 వేల మంది ఆ సమయంలో పోర్ట్‌కు చేరుకున్నారు.

సినిమాలో చూపించినట్టు ప్రమాద సమయంలో దిగువ తరగతి ప్రయాణీకుల్ని పట్టించుకోని విషయం మరణాల లెక్కల్ని బట్టి తెలుస్తోంది. మొత్తం 2224 మంది ప్రయాణీకుల్లో కేవలం 710 మందినే కాపాడగలిగారు. మృతి చెందిన పురుషుల్లో 2 క్లాస్‌లో 92 శాతం మంది, 3 క్లాస్‌లో 87 శాతం మంది చనిపోతే, 1 క్లాస్‌లో 67 శాతం మరణించారు. మిగతా తరగతుల వాళ్ల కన్నా దాదాపు 44 శాతం ఎక్కువ మంది ఫస్ట్ క్లాస్ ప్రయాణికులు ప్రాణాలతో బయట పడ్డారు.

టైటానిక్ ఘటనకు సంబంధించి మరో అన్‌సింకబుల్ వుమెన్ ఉన్నారు. ఆమె పేరు వయొలెట్ జెస్సెప్. వైట్ స్టార్‌లైన్ సంస్థలో ఓషియానిక్ నౌకల్లో నర్స్‌గా పనిచేసిన ఆమె టైటానిక్ ప్రమాదాన్నే కాదు ఆ నౌక శ్రేణిలో ముందొచ్చిన ఆర్ఎమ్ఎస్ ఒలంపిక్, హెచ్ఎమ్‌హెచ్ఎస్ బ్రిటానిక్ నౌక ప్రమాదాల నుంచి కూడా ప్రాణాలతో బయట పడ్డారు. 83 ఏళ్లపాటు జీవించి సాధారణ కారణాలతో మరణించారు. ఆమె టైటానిక్ ప్రమాద సమయంలో ఓడలో ఉన్న ఒకే ఒక చంటిపాప అస్సాద్ థామస్‌ను సురక్షితంగా లైఫ్ బోట్‌లోని ఎడ్వినా ట్రౌట్‌కు చేరవేసింది. ఆ పాప పెద్దయ్యాక ప్రమాదానంతరం దాదాపు 20 ఏళ్ల తర్వాత వయొలెట్‌కు ఫోన్ చేసి కృతజ్ఞతలు చెప్పిందట.

పొలం పనులు మహిళలు లేకుంటే ఒక్క అడుగూ ముందుకు పడవు. అయినా కూడా మహిళా రైతులు చాలా తక్కువ మందే కనిపిస్తారు. తమిళనాడుకు చెందిన ఓ సైన్స్ ఉపాధ్యాయిని రైతుగా మారి తొలి యత్నంలోనే శాస్త్రీయ విధానంలో అత్యధిక దిగుబడి సాధించింది. ఆదర్శ రైతు పురస్కారాన్ని అందుకున్న ఆమె ఒక్క విజయంతోనే ఆగిపోవడంలేదు. వరిని దాటి చెరుకు ఇతర పంటలపై కూడా ప్రయోగాలు చేస్తోంది. అతి తక్కువ స్థలంలో ప్రయోగాత్మకంగా సాగు చేపట్టి భారీ దిగుబడిని సాధిస్తూ నూతన విధానాలపై మిగతా రైతులకు ఆసక్తి రేపుతోంది.

సైన్స్ టీచర్ విశిష్ట రైతు అయిన వేళ...

ప్రసన్నది తిరుప్పలై గ్రామం. తమిళనాడు ప్రభుత్వంచే విశిష్ట రైతు పురస్కారం అందుకున్న ఈ టీచర్‌కు 32 ఏళ్లే. రైతులు కావాలనుకుంటున్న మహిళలకే కాదు మిగతా వారికి కూడా ఆమె రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు. 'సెమై నెల్ సాగుపడి' పేరిట అభివృద్ధి చేసిన విధానంలో ఆమె వరి పంట అధిక దిగుబడులు సాధించింది. కేవలం 50 సెంట్ల భూమిలో 2 కిలోల 'ట్రై 3' రకపు వంగడాల్ని ఉపయోగించి 130 రోజుల్లో 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడిని కళ్ల చూసింది. 2014-15 పంట కాలంలో శ్రీ పద్ధతిలో అధిక దిగుబడి సాధించినందుకు ఆమెకు 5 లక్షల రూపాయల ప్రోత్సాహక బహుమతిని, పతకాన్ని అందించింది తమిళనాడు ప్రభుత్వం.

వ్యవసాయంలో మహిళల భాగస్వామ్యం ఎక్కువే కానీ ప్రసన్నలా పూర్తిస్థాయి రైతుగా ఉండేవారు అరుదు. సాగులో మెళకువలు, పద్ధతులు వంటివి అవగాహన చేసుకోవడానికి ఇంటి పనులు పెద్ద అడ్డంకి అని ఆమె అంటారు. కానీ తాను పొలం పనుల మీదే ఎక్కువ దృష్టి పెట్టడంతో పూర్తిస్థాయి రైతుగా మారగలిగానని చెబుతున్నారు. ఎం పద్మనాభన్‌తో వివాహం కావడంతో మధురైకి దగ్గరలోని కంచరామ్‌పెట్టై గ్రామం నుంచి తిరుప్పలైలోని అత్తింటికి చేరుకుంది. ప్రసన్నపై ఆమె తండ్రి ప్రభావం ఎక్కువ. ఆయన పొలానికి తరచుగా ప్రసన్నను తీసుకెళ్లడమే కాకుండా వ్యవసాయ పనుల గురించి వివరంగా చెప్పేవాడు. ప్రతి దశలోను ఆమెకు ప్రతి అంశాన్ని విపులంగా చెబుతూ ఆసక్తిని కలిగించేవాడు. విత్తు నాటే దగ్గర నుంచి పంటను ఎత్తుకునే వరకు ప్రసన్న ఉండాల్సిందే. అదే ఆమెకు ప్రేరణగా నిలిచి తరచూ పొలాల్ని సందర్శించేలా చేసింది.

ఇప్పుడు సైన్స్ టీచర్‌గా ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్నా పొలం పనులకు తీరిక చూసుకుంటారు. భర్త కూడా కర్షకుడే కావడంతో ఆమె జిజ్ఞాస మరింత ఎక్కువైంది. అదే ఆమెను తంజావూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం వైపు నడిపించింది. అక్కడ 'ట్రై 3' వంగడం గురించి క్షుణ్ణంగా తెలుసుకుని తాను సొంతగా ప్రయత్నించాలని రైతుగా మారింది. చాతిరాపట్టి గ్రామానికి దగ్గరలోని చిన్నపట్టిలో 50 సెంట్ల భూమిలో ప్రయోగాత్మకంగా చేపట్టింది. సహజ ఎరువుల్ని వాడింది. ప్రతి దశలోను వ్యవసాయ శాఖకు చెందిన అధికారులు వచ్చి పైరు పెరుగుదలను రికార్డు చేసుకునేవారు. చివరకు పత్రాల రంగును కూడా రాసుకునేవాళ్లు. తన ప్రయత్నం విజయవంతం కావడానికి కారణం నాట్ల మధ్య దూరమేనంటారు ప్రసన్న. శాస్త్రీయంగా కనీసం 22.5 సెం.మీ. దూరం ఉండేట్టు చూసుకోవడంతో సూర్యరశ్మి మొక్కలకు సంపూర్ణంగా అందింది. 'శ్రీ పద్ధతి'లో సాగును రైతులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడానికి కారణమిదే. నాట్ల మధ్య దూరం మరీ ఎక్కువుండటం వల్ల ఎక్కువ స్థలం కావాలి, లేదా తక్కువ పంట వస్తుందనే అపోహ. జనుము, జీవ ఎరువుల వల్ల కూడా లాభం చేకూరింది. భూసారం పెరగడానికి గొర్రెల మందను పెంచడం ఓ ప్లస్ అయ్యింది. ఈ పద్ధతిలో నీటి వాడకం కూడా తక్కువ. 2015 ఫిబ్రవరి పంట చేతికి రాగా దాన్ని అధికారులు గోడౌన్‌కు తరలించి లెక్కలు వేశారు. అందరి కన్నా ఎక్కువ దిగుబడి సాధించడంతో అవార్డును ప్రకటించారు. ఈ విజయం కోసం ప్రసన్న నాలుగేళ్లుగా ఎంతో పరిశోధన చేసింది. రకరకాల వంగడాల గురించి సమాచారం తెలుసుకునేది. వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని తరచూ సందర్శించేది. ప్రసన్న ఓ వైపు స్కూల్‌కు వెళుతూనే పొలం పనులు చూసుకునేది. ఆమె ఇప్పుడు టెర్రస్ గార్డెనింగ్‌పై కూడా దృష్టి సారించింది. అదే కాదు చెరుకు పంటను బిందు సేద్యం ద్వారా ప్రయత్నించాలనుకుంటోంది. ఈ పద్ధతిని ఆ ప్రాంతంలో ఇంతకు ముందెవరూ ప్రయత్నించలేదు. ఫిజిక్స్‌లో పీజీ చేసిన ప్రసన్న వ్యవసాయంపై దృష్టి పెట్టడంతో ఆ గ్రామంలోని చదువుకుంటోన్న యువత కూడా వ్యవసాయంపై మక్కువ చూపిస్తున్నారు.



ప్రసన్న

గురజాడ కథానికలు

దేవుళ్లు,ఋషులు, రాజులు, వాళ్ల మహిమలు, వైభవాలను కీర్తించడం ఆధునిక కథానిక లక్ష్యం కాదు. ఆధునిక మానవుని విజ్ఞానం, సాహసం, సాఫల్య వైఫల్యాలు, ఆధునిక మానవ సంబంధాలు, ఆధునిక సామాజికోద్యమాలు వీటిని చిత్రించడానికి కథానిక పుట్టింది. ఇటువంటి ఆధునిక కథానికకు తెలుగులో పునాదులు వేసిన కీర్తి గురజాడ వెంకట అప్పారావు పంతులిది. తెలుగు కథానికా వికాసానికి గురజాడ వేసిన పునాది చాలా పటిష్టమైనది. గురజాడ శత వర్ధంతిని పురస్కరించుకుని ప్రజాశక్తి బుక్‌హౌస్ గురజాడ కథలను ప్రచురిస్తున్నందుకు సంతోషిస్తున్నాను.

-రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి

దిద్దుబాటు కథానికలు, రచయిత: గురజాడ అప్పారావు, పేజీలు:56, వెల: 35/-, ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్, కారల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ.

దాశరథి సాహిత్యం

ప్రజాకవి దాశరథి సాహిత్యం
రచన : దాశరథి కృష్ణమాచార్య.
పేజీలు:245, వెల:175/-,
ప్రతులకు: నవచేతనా పబ్లిషింగ్ హౌస్, బండ్లగూడ, హైదరాబాద్.

“కోతిని మనిషిగా తొలిచిన -కాస్మిక్- రేడియేషన్ బలమే/ నా కలంలో చొరబడి -నేడు- మనిషిని దేవతగా మలుస్తుంది./ చితి మంటల యుద్ధానికి - ప్రతి కవి ఒక ఫైర్ బ్రిగేడ్/ అణ్వస్త్రపు గ్రీష్మానికి - ప్రతి పద్యం మబ్బు ముక్క” అని పలికిన దాశరథి గారు కవులే కాదు - వ్యాసాలూ, కథలూ, నాటికలూ, మొదలైనవి అసంఖ్యాకంగా రాశారు. వారి లేఖినీ మహత్వంతో పావనం కాని సాహిత్య ప్రక్రియ అంటూ లేదు. వారేది రాసినా ముందుకు తోసుకుపోవాలనే గిజగిజ యుగయుగాలుగా ఒక రాకెట్ వలె నడపాలనే తహతహ ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంటుంది. అయితే గతం యొక్క ప్రాముఖ్యం, ప్రాశస్త్యం వారికి తెలియనిది కాదు. వారు పండిత వంశంలో జన్మించి భారతీయ సాంప్రదాయాలనూ, సంస్కృతీ వైభవాన్నీ పూర్తిగా అవలోకన చేసి జీర్ణించుకున్నట్టివారు. దాశరథిగారి కృతులు చదువుతుంటే భావనలోనూ, భావప్రకటనలనూ ఇంత వైవిధ్యం వున్న కవులు మరొకరు లేరు అనిపిస్తుంది నాకు

“కంటికి కనిపించిందంతా-కైతగా రాసేస్తున్నాను.../ నావి యక్సు - కిరణాల కళ్లేమో!-నాకేం తెలుసు, లోకమా?/ కంటికి కనిపించిందంతా-కైతగా రాసేస్తున్నాను” అన్న దాశరథిగారు మహాకవులు. ఇదీ అదీ కాకుండా, విశ్వాన్నంతా తన హృదయంలోకి పీల్చుకొని పోగలరు. అగ్నిసెగలను, మమతలను, మానవతను బయటకు ఊదగలిగిన ప్రతిభావంతులు. వారు అపారమైన సృజనశక్తి కలిగిన సృష్టికర్తలు, తమ సృజన శక్తి విశృంఖలంగా ఉద్దీపింప జేసుకోగలిగిన ధీమంతులు దాశరథిగారు.

డా. -త్రిపురనేని గోపీచంద్

వాస్తవ ఘటనలే కథావస్తువుగా...

సమాజంలోని వాస్తవ ఘటనలను కథలుగా, నవలలుగా మలచడంలో విశేషానుభవం గడించిన ప్రముఖ రచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారి వాస్తవ ఘటనల సమాహారం.. ఈ కథల సంపుటం. 2012 కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న పెద్దిభొట్ల 'శిశిరవేళ' పేరుతో వెలువరించిన ఈ కథాసంపుటంలో 18 కథలున్నాయి. వీటిలో 'అర్జునుడు' పెద్ద కథ. మధ్యతరగతి ప్రజల జీవితాలు, కుటుంబ నేపథ్యం, వారి కష్టసుఖాలకు నిలువుటద్దం ఈ కథా సంకలనం. జీవితంలోని వాస్తవికతను... వాస్తవిక, అభ్యుదయ దృక్పథంతో విమర్శనాత్మకంగా విశ్లేషించి శిల్పాత్మకంగా రూపు కట్టించే సంప్రదాయానికి వారసుడీయన.

అభాగ్యులు, మనసుండీ నలిగిపోయే మనుషులు, కాలచక్రం కర్కశ హస్తాల్లో చిక్కిన అమాయకులూ.... అడుగడుగునా పలకరిస్తారు సుబ్బరామయ్య కథల్లో. ఈ కథల్లో మృత్యువు కళ్ల ముందు కనిపిస్తున్నా, మనిషి మనిషిగా ప్రవర్తించే సహజ సన్నివేశాలు ప్రతి కథనూ ఆసాంతం చదివేలా చేస్తాయి. రచయిత వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే రోజువారీ ఘటనలనే కథావస్తువుగా తీసుకొని, తనదైన అద్భుత శిల్పంతో ప్రాణం పోసి

శిశిర వేళ కథా సంపుటం
రచయిత : పెద్దిభొట్ల సుబ్బరామయ్య
పేజీలు:176/-
వెల:120/-
ప్రతులకు : నవచేతన పబ్లిషింగ్ హౌస్ బండ్లగూడ, హైదరాబాద్



వాటిని సజీవ కథలుగా రూపొందిస్తారు. దీనికి 'అర్జునుడు' కథనే ఉదాహరణగా చెప్పొచ్చు. ఈ కథకు 'వీడు కౌంతేయుడు కాదు, మాములు నరుడే' అనే ట్యాగ్ లైన్ కూడా పెట్టారు. ఇది ముగ్గురు స్నేహితుల కథ. ఎన్నో ఏళ్ల తర్వాత అర్జునుడు తన స్నేహితుడు దాశరథి దగ్గరకొచ్చి ఒక కోరిక కోరతాడు. 'నువ్వున్నావని, నాకు నువ్వు మాత్రమే వున్నావని భరోసాతో వచ్చాను... నన్ను ఆదుకోవాలి... ఇంకా నాకెవ్వరూ లేరు' అంటూ చేతులు పట్టుకున్న స్నేహితుడ్ని చూసి చలించిపోతాడు దాశరథి. 'నువ్వు మా అమ్మాయి భానుమతిని కొంతకాలం కడుపులో పెట్టుకుని కాపాడాలి' అంటూ విషయాన్ని వెల్లడిస్తాడు. అర్జునుడికి పెళ్లికాలేదని తెలిసినా, తనలోని అనేక అనుమానాలను లోపలే దాచుకుని భానుమతి బాధ్యతను స్వీకరిస్తాడు దాశరథి. అర్జునుడి చిన్ననాటి స్నేహితుడు కరీముల్లా కూతురినని, అతను మిలిటరీలో చనిపోగా, భార్య బిడ్డను ప్రసవించి చనిపోయిందనీ తెలుస్తుంది. నాడు నెత్తురుగుడ్డుగా చేతుల్లోకి తీసుకున్న ఆ బిడ్డను సురక్షితమైన చోటుకు చేర్చేందుకు అర్జునుడు పడిన మానసిక సంఘర్షణను హృద్యంగా వర్ణించారు రచయిత. స్నేహితుని బిడ్డ కోసం అర్జునుడు తన జీవితాన్నే త్యాగం చేస్తే.... ఒక పెద్ద రహస్యాన్ని మాత్రం ఎప్పటికీ తనలోనే వుంచుకునేందుకు సిద్ధపడి భానుమతి బాధ్యతను ఆనందంగా స్వీకరించిన సహృదయుడు దాశరథి. 'ఇన్నాళ్లు మనకిద్దరు... ఇప్పుడు ముగ్గురు' అనుకుంటారా దంపతులు.

ఇదొక్కటే కాదు... ఈ సంపుటంలోని కథలన్నీ మానవ సంబంధాలతో ముడిపడే వుంటాయి. మచ్చుకు ఒక కథ గురించే చెప్పినా.. మిగతా కథలూ ఆసక్తికరంగానే వుంటాయి. 'శిశిరవేళ' కథలో కథనం శీర్షికలోని అర్థాన్ని తలపింపజేస్తుంది. 'అరవై దాటిన తర్వాత బ్రతకడమే తప్పు'.. 'నీకెందుకీ విషయాలన్నీ, ఒక మూలపడి వుండక' అని దులిపేస్తారు... అంటూ తాతగారు అని పిలవడానికి ఒప్పుకోని ఓ తాత అంతర్మథనం ఈ కథ. అలాగే ప్రతి కథలోనూ ఆయా పాత్రల ఔచిత్యం, ఆ పాత్రలను మలిచిన తీరు చదువరులను కట్టిపడేస్తుంది.

- రాజాబాబు కంచర్ల



అగ్ని వర్షం కథలు విన్నాం. కప్పలు, చేపల వర్షాన్ని ప్రత్యక్షంగా చూశాం. వేడి నీటి ఊటల గురించి తెలుసుకున్నాం కానీ ఏకంగా కిలో మీటర్ల పొడవునా ప్రవహించే మరిగే నది ఒకటుందంటే నమ్ముతారా! అమెజాన్ అడవుల్లో స్వర్ణ పట్టణం ఎల్‌డొరాడోకు చేర్చే దారిన అడ్డొచ్చే ఈ నది క్షణాల్లో ప్రాణాలు తీస్తుందని లెజెండ్. ఎల్‌డొరాడో ఏమో గానీ ఆ మరిగే నది నిజమేనని కొన్నేళ్ల క్రితమే ఓ యువ పరిశోధకుడు వెలుగులోకి తెచ్చాడు. 50-95 డిగ్రీల సెంటీగ్రేడ్ మధ్య ఉష్ణోగ్రతలతో సలసలా కాగే ఆ నది అరున్నర కి.మీ.ల మేర ఉధృత వేగంతో ప్రవహిస్తోంది.

మరిగే నదిని వెదుకుతూ..

అమెజాన్ నదీ పరీవాహకంలో స్వర్ణయుగాన్ని చూసింది ఇన్‌కా నాగరికత. బంగారం రాశి పోసినట్టుండే వారి పట్టణాల గురించి తెలిసి వైకింగ్‌లు మొదలు మొన్నటి యూరోపియన్ కాలనీల వరకు ఎగబడ్డాయి. వారి సంపదనే కాక సంస్కృతిని కూడా చిన్నాభిన్నం చేసేశాయి. లక్షలాది మంది హననం, పట్టణాల నేల మట్టం ఇదీ దక్షిణ అమెరికాలోని అమెజాన్ నదీ పరీవాహకంలో నెత్తుటి చరిత్ర. ఉత్తర అమెరికాలోని రెడ్ ఇండియన్లను వెండి కోసం ఎలా రూపుమాపేశారో దక్షిణ అమెరికాలోని ఇన్‌కాలను అలా తుడిచిపెట్టేశారు. అయినా ఆశ తీరని స్పానియార్డ్‌లు మరింత బంగారం అన్వేషణకు ఇన్‌కాలను అడిగారట. తమ జాతిని జంతువుల కన్నా హీనంగా ఊచకోతలు కోసిన విదేశీయులపై ప్రతీకారంతో అమెజాన్ అడవుల్లో అంతా స్వర్ణంతో కట్టబడిన పట్టణముందని దాన్నే పైటిటీ ఎల్‌డొరాడో అంటారని చెప్పారు. దాన్ని వెతుకుతూ వెళ్లిన వేలాది మంది ప్రాణాలతో బయటపడలేదు. అనకొండలు, భారీ సాలీళ్లు, విష సర్పాలు, వింత కీటకాల వల్ల, విష జ్వరాలతో మరణించారు. ప్రాణాలతో బయట పడిన కొందరు చెప్పిన విషయాల్లో ఎగిరే సర్పాలతో పాటు, వింత జీవాలు అలాగే మరుగుతున్న నది గురించి ఎన్నో లెజెండ్స్ అల్లేశారు.

ఎల్‌డొరాడో ఎంత ఆసక్తి రేపిందో అంతగా మరుగుతున్న నది పరిశోధకులకు నిద్ర పట్టనివ్వలేదు. అగ్నిపర్వత ప్రాంతంలో ఉష్ణనీటి ఊటలు, మడుగులు, కొలనులు, స్ప్రింగ్స్ ఉండటం సాధారణం కానీ ఇలా ఏకంగా మరుగుతున్న నదే ఉందంటే అదో నమ్మశక్యం కాని విషయం. చాలామంది కొట్టిపారేశారు. కారణం అగ్నిపర్వత ప్రాంతానికి వారు చెబుతున్న పెరూలోని అమెజాన్ అడవులు 700 కి.మీ. దూరంలో ఉండటమే. మరో వైచిత్రి అమెజాన్ అంత విస్తారంగా ఉన్నా ఎక్కడా ఇలాంటి అనామొలీ గురించి విన్నది లేదు. సలసలా మరిగే నదిపై ఎన్నో కథలు, కల్పనలు చేరాయి.

అలాంటి ఎన్నో కథల్లో ఒక దాన్ని యాండ్రెస్ రూజో తన తాతయ్య నోట విన్నాడు. ఆ చిన్ని బుర్రలో అలా తిష్ట వేసుకు కూర్చుంది. ఆ నదిలోకి దిగితే ఇక అంతే.. క్షణాల్లో చనిపోతారని, కేవలం షామన్‌లు (స్థానిక దైవారాధకులు) మాత్రమే అక్కడ వరకు వెళ్లగలరని వివరణలు ఉండటంతో యాండ్రెస్ ఉత్సాహం మరింత పెరిగింది. ఆ నది అన్వేషణకు అతడి నేపథ్యం కూడా బలాన్నిచ్చింది. నికరాగువాలోని కేసిటా అగ్నిపర్వత సమీపంలోని గ్రామంలో అతడి బాల్యం గడిచింది. అక్కడి వేడి నీటి ఊటల్లో ఆడుకున్న గురుతులెన్నో. వీటిపై ఉన్న పిచ్చే అతణ్ని భూభౌతిక శాస్త్రంలో పీహెచ్‌డీ చేసేలా ప్రేరణనిచ్చింది. తాతయ్య చెప్పిన ఆ నది పేరు షానయ్‌తింపిష్కా పదే పదే గుర్తొచ్చేది.

అన్వేషణ మొదలైంది..

పీహెచ్‌డీ పూర్తయ్యాక 2011లో నేరుగా పెరూ వెళ్లిపోయాడు యాండ్రెస్. అక్కడుంటోన్న తన అత్తమ్మ వద్ద తాతయ్య అన్నమాటను ప్రస్తావించాడు. ఆమె కూడా అవును నిజంగా మరిగే నది ఉంది. అది కాస్త చల్లబడ్డప్పుడు నేను ఈదాను కూడా. ఆ మరిగే నదిలో చిన్న చిన్న జలపాతాలు కూడా ఉన్నాయని చెప్పడంతో షాక్‌కు గురయ్యాడు. ఆమె మాటల్ని తేలికగా తీసుకోకుండా అక్కడికి ఎలా వెళ్లాలో ఆరా తీశాడు. దూరం నుంచి మంచు తెరల్ని చూసి నీటి ఆవిరి అనుకుంటున్నారేమో లేదా వీళ్లు వెళ్లిన వరకే ఏదైనా హాట్ స్ప్రింగ్ ఉందేమో అని భావించాడు. అత్తమ్మ చెప్పిన దారిన మయన్‌టుయాకు ప్రాంతానికి చేరుకుని స్థానిక తెగవారిని గైడ్‌లుగా చేసుకుని అమెజాన్ అడవుల్లోకి చేరాడు. పుకల్పా పట్టణం నుంచి 2 గంటల కారు ప్రయాణం తర్వాత గంట మోటార్ బోట్ ప్రయాణం. ఆ తర్వాత సుమారు గంటన్నరపాటు అడవిలో హైక్ చేశారు వారంతా. విశ్రాంతి తీసుకుంటుండగా అడవంతా మంచు దుప్పటి కప్పుకున్నట్టు చెట్లను నీటి ఆవిరి కప్పేసింది. విపరీతమైన ఉక్కపోత, ప్రాణవాయువు సరిగ్గా అందలేదు. అప్పుడు తన థర్మల్ స్కానర్‌తో చెక్ చేస్తే ఉష్ణోగ్రతలు అంతకు ముందున్న ప్రాంతంలో కన్నా ఒక్కసారిగా పెరిగిపోయానని తెలుసుకున్నాడు. ఆ తెరల్లోంచి కాసేపు నడిచాక ఉధృతంగా ఏదో నది ప్రవహిస్తున్న శబ్దం. పది నిమిషాలు వేగంగా నడిచాక ఓ అద్భుత దృశ్యానికి సాక్షిగా నిలిచాడు. అషనిన్‌కా షామన్ అయిన మేస్త్రో యువాన్ ఫ్లోరెస్ నది ఒడ్డున నిల్చొని మురళీగానం చేస్తున్నాడు. నీటి ఆవిరి ఆ నదిలోంచే వస్తుండటం

యాండ్రెస్ గుర్తించాడు. లెజెండ్‌గా చెప్పుకుంటున్న ఆ మరిగే నది తావున తానుండే సరికి ఉద్వేగంతో కళ్లెంట నీరు ధారలు కట్టాయి. తాను కనిపెట్టేశాడు.. నిజంగా మరిగే నది ఒకటి ఉందని ప్రపంచానికి రుజువులతో చెప్పబోతోన్న వ్యక్తి తానేననేది నమ్మలేకపోయాడు.

రహస్యంగా..

తొలుత షామన్ యాండ్రెస్‌ను అనుమానంగా చూశాడు కానీ కొన్ని రోజులకే ఆ నదీ విశేషాల్ని వివరించాడు. కొన్ని వందల ఏళ్ల నుంచి తమ అషనిన్‌కా షెరిపియారీ పెద్దలు ఆ నదిని అతి పవిత్రంగా చూస్తున్నారని, దాన్ని కాపాడుకునే ఉద్దేశంతోనే ప్రపంచానికి పూర్తి వివరాలు, దారిని ఇన్నాళ్లు తెలియనివ్వలేదని చెప్పాడు. తాము ఆరాధిస్తోన్న, ప్రాణ ప్రదంగా చూసుకుంటున్న నది పవిత్రతకు భంగం కల్గించకుండా ఉంటే పరిశోధన చేసుకోవచ్చని అనుమతించాడు. వందల ఏళ్లుగా అమెజాన్‌లోని కొన్ని అటవీ తెగలవారు షామన్ల సాయంతో ఈ నది వద్దకు రహస్యంగా చేరుకుని ఆరాధిస్తారని చెప్పాడు. అక్కడ మాత్రమే లభించే ఓ రకమైన వృక్షం ఆకుల వల్ల కొన్ని రోగాలకు చికిత్స చేస్తారని అన్నాడు. నది నీటి ఆవిరి వల్ల నిజంగానే అక్కడ ప్రత్యేకమైన జీవ వ్యవస్థ రూపుదిద్దుకుంది. రనాకొ వృక్షాలతో పాటు ఎన్నో ఔషధాల వృక్షజాలం అక్కడ షామన్‌లకు పేరు పేరునా తెలుసు. కొన్ని వేల ఏళ్ల నుంచి నది ఉందనేది పెద్దల మాటని యాండ్రెస్‌కు చెప్పాడు. ఆ నది పేరయిన షనాయ్‌తింపిష్కా అంటే సూర్యుని వల్ల మరిగినది అని అర్థం. ఇది క్వెచువా మాండలికంలో ఉంది. అది మరీ అంత పురాతనం కాదు. అంతకుముందు నుండే ఉందనేది షామన్ పెద్దలు చెప్పారంటే కచ్చితంగా దీని ఉనికిని కావాలనే జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. దానిలో నీరెలా మరుగుతుందో తెలీక వారెక్కువగా ఆరాధించే సూర్యుడితో లింక్ చేశారు.

అన్నీ వింతలే..

ఈ సంగతులన్నీ తెలుసుకున్నాక యాండ్రెస్ వెంటనే తన పరిశోధనను మొదలు పెట్టాడు. తన థర్మల్ స్కానర్లతో మొత్తం నది ఉష్ణోగ్రతల లెక్కల్ని తీశాడు. అతడు ఆశ్చర్యపోయేలా ఏదో కొద్ది మీటర్ల వరకో నది మరగడం లేదు. వందల మీటర్లు దాటిపోయాడు. వేల మీటర్లలోకి దారితీశాడు. ఒక్కో చోట 90 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరుకుంది వేడి. అంటే నీరు ఆవిరి అయ్యేందుకు కొద్ది డిగ్రీలు చాలు. ఆ నీటిలో క్షణం పాటు ఉన్నా థర్డ్ డిగ్రీ గాయాల కన్నా పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. ఆ నదిలో పడి ఉడికిపోయిన పక్షుల్ని ఇతర జంతువుల్ని చూశాడు యాండ్రెస్. ఇలా ఏళ్ల పాటు పరిశోధన చేశాక షామన్‌లు హెచ్చరించినా వినకుండా నది ముఖ ద్వారం అని చెప్పుకునే యకుమామా ప్రాంతానికి దోవ పట్టాడు. అక్కడే చల్లటి నీరు వేడి నీరుగా మారుతుందని, యకుమామా ఓ కొండ గుహలా ఉంటుందని, దాని తీరు అనకొండ ముఖాకృతిలో ఉంటుందని పోలికలు చెప్పారు షామన్‌లు. కొంత మంది గైడ్‌ల్ని వెంటేసుకుని వెళ్లాక కొంత దూరం వారు ఆగిపోయారు. వారు భయపడుతోంది చుల్లాచకీస్ అనే షేప్ షిఫ్టర్ల గురించే. ప్రియతముల రూపంలో ఆకారాన్ని మార్చుకునే జీవాలు ఆ ప్రాంతంలో కలియతిరుగుతాయని, అవి మోహించి ప్రాణాలు తీస్తాయనేది వారి భయం. ఈ విషయాలేవి కాదు గానీ యాండ్రెస్ కూడా ముందుకు వెళ్లేందుకు జంకాడు. ఎందుకంటే అది అమెజాన్ అటవీ

ప్రాంతం. ఎప్పుడు వర్షం ఉన్నపాటున ఉధృతమవుతుందో, ఒక్కపెట్టున ఎప్పుడు వరద పోటెత్తుతుందో తెలీదు. అప్పుడు గానీ ఆ వేడి నీటి ప్రవాహంలో పడితే ఇక అంతే సంగతులు. కానీ అతడిలోని పరిశోధకుడు ముందుకు నడిచేలా మూర్ఖత్వంతో కూడిన ధైర్యాన్నిచ్చాడు. నిజంగా షామన్‌లు చెప్పినట్టే అక్కడ ఒక కొండ రాయి పాము ముఖాకృతిలో ఉంది. దానికి ముందున్న నీరు చల్లగానే ఉన్నాయి. సరిగ్గా ఆ ప్రాంతం వద్ద వేడి నీరు తావు మొదలైంది. తొలుత అదో హాట్ స్ప్రింగ్ అని తలచినా దాని ప్రభావం పరిమితంగా ఉండాలి కానీ అలా వేల మీటర్ల పాటు నీరుని వేడి చేస్తోంది వేరే పరిస్థితేమో అనుకున్నాడు. ఈలోగా అనుకున్నట్టే భారీ వర్షం కురిసింది. కేవలం కాలిపాదాల్ని తాకేంత స్థలమున్న రాతిపై ప్రవాహం మధ్యలో యాండ్రెస్ ఇరుక్కుపోయాడు. మరింత వాన ఎక్కువైతే కొట్టుకుపోయేవాడు. ప్రమాదం నుంచి బయటపడ్డాక వర్షపు నీటి వల్ల నది ఉష్ణోగ్రత తగ్గిందనే విషయాన్ని గుర్తించాడు. తన అత్తమ్మ చెప్పినట్టు ఆ సమయంలో షామన్‌లు నదిలో ఈదులాడారు కూడా.

అంతా వింతే

యాండ్రెస్‌ను మరిన్ని వింతలు ఆకర్షించాయి. అంత వేడి నీటిలో కూడా యథేచ్ఛగా పెరుగుతున్న కొన్ని సూక్ష్మజీవజాలాలు, నీటి ఆవిరి అధికంగా ఉన్నా మనగలుగుతున్న చెట్లు, కొన్ని చేపల్ని చూశాడు. తర్వాత కొందరు వృక్ష, జీవ శాస్త్ర పరిశోధకులకు కబురు పెట్టాడు. వారు ఆశ్చర్యపోయేలా అక్కడి జీవ వైవిధ్యం ఉంది. చాలా జీవజాలాల ఉనికి మరెక్కడా కనిపించింది లేదు. యాండ్రెస్ సర్వేక్షణలో ఎన్నో కొత్త అంశాలు తేలాయి. నీటి శాంపిళ్ల ల్యాబ్ రిజల్ట్స్ నదిలోనివి వర్షపు నీరే కానీ ఈనాటి జలాలు కావని, అక్కడ సల్ఫర్‌కు సంబంధించి ఆనవాళ్లు లేకపోవడంతో కచ్చితంగా ఇది అగ్నిపర్వత ప్రభావంలో లేదని తేల్చుకున్నాడు. కానీ ఇంకేమై ఉంటుందని ఆరా తీస్తే ఓ సిద్ధాంతంగా భావించే వేడి నీటి ప్లంబింగ్ వ్యవస్థ గుర్తొచ్చింది. కొన్ని నదులు అంతర్వాహినులుగా ప్రవహిస్తాయి. అలాగే భారీ జల నిధులు భూపొరల్లోని ఫాల్ట్ లైన్‌ల గుండా భూమి లోలోపల వరకు చేరుకుంటాయి. అక్కడి నీరు చాలా భారీగా చల్లగాను ఉండొచ్చు, భూమి కేంద్రకం అత్యంత ఉష్ణోగ్రతలు, పీడనాల వల్ల బాష్పీభవన స్థాయికి మించిన ఉష్ణోగ్రతలున్నా ద్రవ రూపంలోనే ఉండొచ్చు. వేడి నీరు, చల్లటి నీరు మధ్య రియాక్షన్ల వల్ల పైకి ఎగదోసుకు వస్తూ ఎక్కడో చోట బయట పడతాయి. వాటినే నాన్‌వొల్కానిక్ హాట్ స్ప్రింగ్స్, మడుగులు అంటారు. వీటిని మలేషియాలో చూడొచ్చు. కానీ ఇలా ఏకంగా నదిలా ప్రవహించడం వెలుగులోకి వచ్చింది మాత్రం ఇదే తొలిసారి. యాండ్రెస్ లెక్కల ప్రకారం యాండీస్ పర్వత ప్రాంతంలోని మంచు నీరు ఫాల్ట్ లైన్ల ద్వారా అట్టడుగుకు చేరి ప్లంబింగ్ వ్యవస్థ తరహాలో ఇక్కడి ప్రాంతంలో పైకి చేరుతుండొచ్చనే అభిప్రాయం. ఈ విషయాన్నే తేల్చేందుకు 'బాయిలింగ్ రివర్ ప్రాజెక్ట్' ద్వారా పరిశోధనలు కొనసాగిస్తోంది యాండ్రెస్ బృందం. యాండ్రెస్ సేవల్ని గుర్తిస్తూ నేషనల్ జాగ్రఫిక్ సంస్థ తమ యంగ్ ఎక్స్‌ప్లోరర్‌గా గౌరవించింది. అత్యంత అరుదైన ఈ మరిగే నదిని ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించి దీని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, పెరూ ప్రభుత్వం ఇక్కడ పర్యాటకం అభివృద్ధిని నిరుత్సాహపరిచి ప్రత్యేక జీవ వైవిధ్యాన్ని కాపాడాలని విన్నవిస్తున్నాడు. షామన్ లతో కలసి పనిచేస్తూ ఎన్నో కొత్త విషయాల్ని వెలుగులోకి తెస్తోంది యాండ్రెస్ జట్టు

-అనన్య ప్రసిద్ధ్



బట్టలుతికే సైకిల్...

సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి మేలు. కానీ సమయం ఉండదు. అలానే బట్టలుతకడం పెద్ద పని. సమయాన్ని కిల్ చేయడంలో వాషింగ్‌కు మించేదేముంటుంది. అందుకే చైనాలోని డేలియన్ జాతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఓ తెలివైన ఆలోచన చేశారు. బైక్ వాషింగ్ మెషీన్‌ను రూపొందించారు. దాన్ని తొక్కుతూ ఉంటే చాలు బట్టల పని పడుతుంది. బీవా అనే మరో డిజైన్‌తో స్లొవేకియా సృజనకర్త ముందుకొచ్చాడు. త్వరలో మార్కెట్‌లోకి వచ్చే అవకాశాలున్నాయి. అప్పుడు ఎంచక్కా సైక్లింగ్ చేస్తూ న్యూస్ పేపర్ చదువుతూ అటు బట్టలు కూడా ఉతుక్కోవచ్చు. బావుంది కదా.

కాలిఫోర్నియాకు చెందిన ఫ్రెడెరిక్ కాల్లిసన్ రోడ్డు మీద పడి రెండేళ్లవుతోంది. తింటానికి ఒక ముద్ద దొరక్క రోజూ అవస్థలు పడుతుంటాడు. కానీ భిక్షాటన చేయడు. ఓ రూపాయికి చేయి చాచకుండా ఆర్డెన్ దారిలో వాట్ అవెన్యూ వద్ద కూర్చుని దారిన పోయేవారి చేతుల్లో ఓ రెజ్యూమె పెడుతున్నాడు. కుదిరితే ఓ చిన్న ఉద్యోగం ఇప్పించరూ అంటూ వినమ్రంగా అడుగుతున్నాడు. తనకు సాయం చేయాలని మనసుకు తోస్తే ఓ ఉద్యోగం చూసి పెట్టండని అంటున్నాడు. 52 ఏళ్ల ఫ్రెడెరిక్‌కు కుక్‌గా అపార అనుభవం ఉంది. సోషల్ సెక్యూరిటీ నంబర్ ఉంది. వాటిని రెజ్యూమోలో మెన్షన్ చేశాడు కూడా. సాక్రమెంటోలో 'నాకు పని కావాలి... ఆకలిగా ఉన్నాను' అని రాసి ఉన్న అట్టముక్కతో తిరుగుతున్న ఫ్రెడెరిక్ పదాల్లోను పనికే ప్రాధాన్యతనిచ్చాడు. ఇదే అందరి దృష్టిని ఆకర్షించి అతడి ఫొటోల్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు.

ఉద్యోగముంటే ఇప్పించండి

వింత లోకం



అమెరికాలోని లూసియానాలో మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్న కుర్రకారు ఎక్కువవుతున్నారు. ఈ విషయం తల్లిదండ్రుల్ని తీవ్రంగా కలచి వేస్తోంది. టీనేజర్ల గదుల్లో ఎక్కడ వాటిని దాచి పెడుతున్నారో తెలీక తలలు పట్టుకుంటున్నారు. కానీ ఇప్పుడు కాదు. మైకేల్ డేవిస్ అనే వ్యక్తి 'ది లాస్ట్ చాన్స్' (చివరి అవకాశం) పేరిట కే9 సర్వీసెస్‌ను ప్రారంభించాడు. మత్తు పదార్థాలను గుర్తించే జాగిలాలు ఇప్పుడు భద్రతా దళాల వద్దే కాక ఈ ఏజెన్సీ వద్ద కూడా ఉంటాయి. ఏదైనా అనుమానం కలిగితే తల్లిదండ్రులు ఒక్క ఫోన్ కాల్ కొడితే చాలు ఈ ప్రైవేట్ యాంటి నార్కోటిక్స్ దళం దిగిపోతుంది. మూలమూలల్లో ఎంత రహస్యంగా ఉంచిన జాగిలాలు ఇట్టే గుర్తు పట్టేస్తున్నాయి. మత్తు బానిసలు ఎంత తెలివి మీరిపోయారంటే చిన్న పిల్లలకు పెట్టే సెరియల్ బాక్స్‌ల్లోను గంజాయి పొట్లాలను దాచి తప్పించుకుంటున్నారు. వాటిని పసిగట్టేయడమే కాక కౌన్సెలింగ్ ఎలా ఇవ్వాలో తల్లిదండ్రులకు నేర్పిస్తున్నారు. మైకేల్ ఈ సర్వీసెస్ నిర్వహించడానికి బలమైన కారణం ఉంది. పదేళ్ల క్రితం... నిండు చూలాలైన తన భార్యతో వీధిలో వెళుతుంటే ఓ మత్తు బానిస డబ్బులివ్వాలంటూ ఆమెపై దాడి చేశాడు. ఆ దాడిలో బిడ్డను కోల్పోయారు. దీనికంతా కారణం అడిక్షనేనని, మరో కుటుంబానికి ఇలా జరక్కూడదని మైకేల్ ఈ స్టెప్ తీసుకున్నాడు. మైకేల్ స్మగ్లర్ల దాడులను తప్పించుకునేందుకు పోలీస్ సాయం తీసుకుంటాడు. ఓవర్ డోస్ అయిన వారిని కాపాడేందుకు వైద్యుల బృందాన్ని వెంటతీసుకెళతాడు.

డ్రగ్స్ ఎక్కడున్నా..

ఆహారం వృథా కాకుండా..

ఇక్కడ ఎక్స్‌పైరీ డేట్‌కు ముందే కుళ్లిపోయే సరకు సాధారణ విషయం కానీ, డెన్మార్క్‌లో ఆ డేట్ దాటాక కూడా తాజాగా ఉండే ఆహారం మామూలు విషయం. ఉత్పత్తుల్ని ఎక్కువగా అమ్మేయాలనో, లేక ఆరోగ్యంపై మరీ అప్రమత్తతో తెలీదు కానీ ఇలా టన్నుల్లో వృథా అవుతున్న ఆహారం ఎక్కువ. ఐరాస లెక్కల ప్రకారం ఒక్క డెన్మార్క్‌లోనే ఏటా 700 కోట్ల కేజీల ఆహారం వృథా అవుతోందట. ఇక ప్రపంచవ్యాప్తంగా అయితే ఏకంగా లక్షా 30 వేల కోట్ల కేజీలేనట ఆ వృథా. ఓ వైపేమో ధరలెక్కువై పూట తిండికి నకనకలాడుతున్న వారి కష్టాలు. ఈ రెండు సమస్యలకు చెక్ పెట్టేందుకు కోపెన్‌హ్యాగెన్‌లో 'వీ ఫుడ్' అనే సంస్థ సూపర్ మార్కెట్‌ను ప్రారంభించింది. గోడౌన్లలో, సూపర్ మార్కెట్‌లలో ఎక్స్‌పైరీ డేట్ దాటి పారేస్తున్న ఆహారాన్ని వీరు తీసుకుంటారు. వాటిని జాగ్రత్తగా పరిశీలించి తినగలిగేవాటిని ఏరి అమ్ముతున్నారు.

అక్షర దీపికలు

ఏదో సన్నని రాగం
చెవిలో వినిపిస్తుంది
ఏదో కరుణ తరంగిణి
ఆ స్వరం మోసుకొస్తూ వుంది
రెండు కొండల మధ్యలో
నదిపాయగా వెళుతూ
కొండతో చెప్పిన ముచ్చట్లు వినిపిస్తున్నాయి
'నదికి కదా గాయాలవ్వాలి
కొండకేమిటి' అంది నది
అప్పుడు కొండ స్నేహితా
ఇప్పుడు నదీతరంగాలు పదును తేరాయి.
ఆకాశ నక్షత్రాలు తనలో అద్దం
చూసుకొంటున్నపుడు
ఆ వెలుగులు సంతరించుకొంటున్నాయి
తరగల్లో సూర్యుడు అద్దం
చూసుకొంటున్నపుడు
ఆ వెలుగులు సంతరించు కొంటున్నాయి
తరగల్లో సూర్యుడు అద్దం
చూసుకొంటున్నపుడు
నది ప్రజ్వలనం అవుతుంది
బింబ ప్రతిబింబ భావం పొందుతోంది.
నది కోయిల పాటలు ఆలపిస్తుంది
నేనేముంది ఎండకి ఎండి
వానకి తడవడం తప్ప అంది.
అందుకు! నది 'బాగాపొగిడేశారు
మీ రక్షణ కవచం లేకుండా
ఇవన్నీ చేయగలుగుతున్నానా
మీ నిబ్బరం, ఓపిక
దీర్ఘదృష్టి నాకుపెద్ద అండకదా!' అంది
కొండ తనలో తాను నవ్వుకొంది.
నిజమే!
పరస్పరాధారితమైన
ప్రకృతంతా ఎంతో పరవశమౌతుంది
ఆత్మగౌరవం పోకుండానే వ్యక్తిత్వ పూర్ణగా
అవి
వర్ధిల్లుతున్నాయి కదా!
రాగమేదైనా అది మాధుర్యమైతేనే
కర్ణపేయమౌతుంది
అవును! మెదడుకు విశ్రాంతినిచ్చేది
సంగీతమే!
ప్రతి గీతంలోను ఒక లయబద్ధత వుంటుంది
ఆ మంచులో తడిసిన మల్లె
ముత్యాలు అలంకరించుకొన్నట్లు
ఏదో మూగబాసలో పలకరిస్తుంది
సూర్య కిరణాల వేడి ఆ మల్లికి
తగలకముందే ఆ పూలు విచ్చుకొన్నాయి
అభివ్యక్తి చేయలేని ఎన్నో పూలు
పక్షుల కూజితాలువిని,
ఉల్లాసితమౌతున్నాయి.
సున్నితమయినవన్నీ
అంతరంగాన్ని విప్పలేక పోతున్నాయి
పక్షుల గూడులో ఒదిగిన పసికందులు
వెచ్చదనాన్ని
తల్లి పొదిగిట్లో పొందుతున్నాయి
మోకాళ్ల బలమున్న పందెపు గిత్తల
పరుగుకు భూమి కృంగిపోతుంది
మేపే ఆసామిని కూడా అవి
కొన్నిసార్లు కొమ్ముతో పొడుస్తున్నాయి
పసిగ్రత్తో యజమాని కొట్టికొట్టి
వాటిని లొంగదీస్తున్నాడు.
పందాలు చూడడానికి ఎగబడేవారొక పక్క
మీసాలు దువ్వుతున్నారు.
లండన్ హౌసాఫ్ కామన్స్ దగ్గర
పావురాలు గుంపులుగా ఎగురుతున్నాయి
ముంబాయి సముద్రం ఒడ్డున కూడా
నేను పావురాలను చూశాను.
మలేషి కొండల మీద ఎదిగిన
చెరకు గడలను నేను చూశాను
జొన్స్‌బర్గ్‌లో మేఘాల దొంతర్ల
ముచ్చట్లు నేను విన్నాను
ప్రపంచమంతా కొండలు, లోయలు, నదులు
పక్షులు ఒక శృతిలో పాడుతున్నాయి
మనిషిని ఉత్తేజపరిచేది
చిన్నగడ్డిపువ్వే
అది నిశ్చలంగా సూర్యరశ్మిని
'భూసారాన్ని' గ్రహిస్తుంది.
ఆ గిరిజన స్త్రీ దాన్నిచూచి ఆనందించింది
దాన్ని తుంచివేయలేదు
మనుషులు కరుణార్ద్రులైతే
గడ్డిపువ్వుల్ని ప్రేమిస్తారు
సుకుమారమైన భావాలకు
ప్రేరితులవుతారు
శిశువులు మరణించకుండా చూస్తారు
ఆ కడుపులోనే భ్రూణహత్యకు
గురవుతున్న పసిపిండాలు రక్షించబడతాయి
మాతృత్వం వికసిస్తుంది
జీవించే హక్కు అందరి సొంతం
ఆత్మీయతా సృజనం నుండే
అక్షర దీపికలు
అందుకే
ఆ నది స్వరాన్ని నేను వింటూనే వున్నాను
ఆ శృతి నుండి ప్రేమ దీపాలు వెలిగిస్తున్నాను

- కత్తి పద్మారావు,
9849741695

నా దేశంపై 'దేశభక్తులు' పడ్డారు

అవును
నా దేశంపై దేశభక్తులు పడ్డారు
నా తల్లిపై త్రిశూలాలతో దాడి చేస్తున్నారు
లేనిది చూపుతూ
ఉన్నదానిని తుడిచేయాలనుకుంటున్నారు
వారి ఆలోచనే భక్తిగా
అనుసరణే ముక్తిగా
మాటల మూటలను అల్లుతున్నారు
నా దేశాన్ని కాషాయీకరింపజూస్తున్నారు
'బ్రిటీషర్లతో పోరాడి
మీ శక్తిని వృధా చేసుకోకండి'
స్వాతంత్ర్య సంగ్రామంలో
చెడ్డీ వాలా నాయకుడి పిలుపు
వాడి శిష్యులే ఈనాటి దేశభక్త ముఠాలు
ఆనాడు శత్రువులతో కలసి వెన్నుపోటు
ఈనాడు దేశభక్తులమంటూ దాడులు
జాతిపితను చంపిన గాడ్సే
వీరికి దేవుడు
గుజరాత్‌లో నరమేధం సృష్టించినవాడు
వీళ్ల నాయకుడు
జాతీయ జెండాను తగులబెట్టడం
రాజ్యాంగాన్ని అవహేళన చేయడం
కులాల మధ్య కుంపట్లు
మతాల మధ్య మంటలు రాజేయడం
వీరి దేశభక్తికి నిదర్శనాలు
రంగు రంగుల పూలతో
నందన వనంలా ఉన్న నా దేశాన్ని
కమలం నీడన కప్పెట్టాలనుకుంటున్నారు
మనువాదపు నీడలు వీళ్లు
మతోన్మాదపు జాడలు వీళ్లు
జాతులను నాశనం చేసే
జాతీయ వాదులు వీళ్లు
వారి గురించి నిజం మాట్లాడినా
వాస్తవాలు రాసినా వృద్ధులను కూడా
చంపేసే సహనమూర్తులు వీళ్లు
రవి కిరణంలా ప్రకాశిస్తున్న
రోహిత్ మరణానికి కారణం వీళ్లు
అతని శవంపై కుల రాజకీయాలు నడిపిన
కాషాయ కర్కోటకులు వీళ్లు
విశ్వవిద్యాలయాలలో
మనువును, వర్ణవ్యవస్థను
బలవంతంగా రుద్దాలనుకుంటున్నారు
ఇది అన్యాయం అని గొంతెత్తిన
కన్నయ్యపై రాజద్రోహిగా ముద్రవేశారు
అమానుష దాడులు చేస్తున్నారు
ముందు ముందు చెడ్డీలేని ప్రతివాడినీ
దేశద్రోహిగా ప్రకటిస్తారేమో..?

- పఠాన్ రసూల్ ఖాన్
9397076152

◆ కథ



కథలు చెప్పకు!

బులుసు సరోజని

మధుర పెదవుల మీద నవ్వు నర్తిస్తోంది. లేత చిగురాకుల కొమ్మల కొస రెమ్మల్లోంచి కోయిల పలికే రాగాల మధ్య సమయాన్ని మనసు తీయగా గుర్తిస్తుంటే ఆనందంతో కేరింతలు కొట్టే పసిపాప నవ్వది. ఆ రోజు వేకువనే మెలకువ వచ్చి భర్తా, మరిది, అత్తగార్లకు ఏమాత్రం నిద్రాభంగం కాకూడదని అడుగులో అడుగు వేస్తూ నెమ్మదిగా పెరటి వైపు వచ్చి మారే ప్రకృతిని తనివి తీరా చూస్తూ చెట్టురాల్చిన ఎండుటాకుల్ని ఓ పక్కగా నెట్టి అగ్గిపుల్ల వెలిగించింది. మంట రాజుకునేలోపు పొగలు పైపైకి సాగుతూ వలయాలుగా ఏర్పడి దాన్లో నుంచి చక్కని ఆకృతులుగా చుట్టుపక్కలికి వ్యాపిస్తున్నాయి. ఆకులన్నీ కాలి బూడిదయ్యేటప్పటికి సూర్యకిరణాలు చెట్ల నీడల సందుల్లోంచి భూమ్మీదకి దూసుకొస్తున్నాయి. పిట్టలు ఇంకా తీయని పాటలు పాడుతూనే వున్నాయి. అక్కడున్న గోడకి ఆనుకుని ఆ ప్రశాంతత వర్ణింపశక్యం కానట్టుగా కళ్లు మూసుకుంది. ఆ తన్మయత్వాన్ని చెదరగొడుతూ "ఏయ్!" అనే పిలుపు వినబడి ఉలిక్కిపడింది. పిలుపుతోపాటే వడివడిగా దూసుకొచ్చిన రామకృష్ణ నివురుగప్పిన నిప్పు పోగుమీద కాలేసి 'అమ్మా'! అంటూ వెనక్కి లాక్కున్నాడు. "అరెరె! ఏం కాలేదు కద?' ఒకింత గాబరాగా ఆత్రుతతో ముందుకి ఓ రెండడుగులు వేసిందో లేదో అక్కడే ఆగమన్నట్టు చెయ్యి ముందుకి చాచి ఆపై ఇంకో చేత్తో కాలు పైకి లాక్కుని చూసి ఏం కాలేదని నిర్ధారించుకున్నాక

"నీకు బుర్రుందా?" అని గట్టిగా అరిచాడు.

"చెత్త పేరుకుపోతోందని తుడిచి..." మధుర రీజన్ చెప్పబోతుంటే 'కథలు చెప్పకు' అన్నాడు కటువుగా మాటలు పూర్తి చెయ్యనివ్వకుండా. కొన్ని నెలలుగా తను అత్తవారింట అడుగు పెట్టిందగ్గర్నుంచీ వింటోందా మాట భర్త నోటి నుంచి. ఏం చెప్పబోయినా కథలంటాడు. ఎవరో అంటించిన ఊత పదమేమో అనుకుంది మొదట్లో. కానీ రోజూ పొద్దున్నే తాగే కాఫీలా అలవాటయి పోయిందనీ, అలా అనకుండా ఉండలేడనీ అర్థమయింది. మధుర పెదాల మీద నవ్వు తొంగి చూచి అంతలోనే మాయమవడం కనిపెట్టేశాడు రామకృష్ణ. వెక్కిరింతో, వెటకారమో, ఇంకేదో అయివుంటుందని అనిపించిది అతడికి.

"అసహనంతో ఏంటా నవ్వు? ఎవడన్నా ఉన్నాడా గోడవతల? నువ్వు పోరంబోకువైతే నాకేం నష్టం లేదు. కానీ నన్ను చేతకాని వెధవ, వాజమ్మ అంటారే! లోపలికి నడువ్" అన్నాడు దురుసుగా, మంటగా. గంభీరమైపోయిందామె.

అతడి మాటలు అలాగే వుంటాయి. పదునెక్కువ. అతడి వెనుకే లోపలికొస్తుంటే "మీ బాబు ఫోన్ చేశాడు. నెలలు దాటి సంవత్సరం వచ్చేస్తున్నా వారం క్రితమే పెళ్ళయినట్టు ఎవ్రి సండే నిన్ను బీచ్‌కి తీసుకెళ్ళమని సలహా. పైగా విశాఖ బీచ్‌కి 'రామకృష్ణా బీచ్' అని నా పేరే పెట్టారని పొగడ్త" వెనక్కి తిరిగి చూశాడు వింటోందా? లేదా? అని. చురుక్కుగా చూసిందతని వైపు చురకేసినట్టయి తల ముందుకు తిప్పేసి

"నాకూ సబబే అనిపించింది. ఎంత తాడుక్కట్టేసిన పెంపుడు జంతువునైనా సరే తిప్పక తప్పదు. లేకపోతే తాడు తెంచుకుపోతుంది. తిరిగొచ్చాక ఆవో, గేదో అయితే తిరిగి కొయ్యక్కట్టెయొచ్చు గానీ ఆడదాన్నెలా?" అన్నాడు. గతుక్కుమంది మధుర. ఊహ తెలిసిన తర్వాత పరుషమైన పదజాలానికి, సౌమ్యంగా పలికే విధానానికి తేడా తెలిశాక కఠినమైన మాటలకు జలదరించినట్టయి తల గట్టిగా విదిల్చింది. ఆ వెంటనే అతణ్ణి పరికించి చూసింది. అతడి వాగుడుకీ, ఆ వాలకానికీ, ఎగశ్వాసకీ ఆపుకోలేనంత నవ్వొచ్చేస్తోందామెకి.

కొద్దిసేపటి తర్వాత టిఫిను తింటూ అన్నాడు "మీ నాన్న అన్నీ ప్రామిస్‌లు చేశేస్తాడు. అదిస్తా, ఇదిస్తానని. నేనే అడిగినట్టు పిట్టకథలు చెప్తాడు. నా సంపాదన, ఉన్న పొలం చాలవా నాకు? నిన్ను నేను బాగా చూసుకోవాలనే తాపత్రయం కూడా ఉండడం సహజమే. నేనర్థం చేసుకోగలను. ఓ... కనపడిందగ్గర్నుంచి అతి మర్యాదలు చేసేస్తూ వుంటాడు. పోన్లే... దర్జాగానే వుంది కదా అని మాట కలుపుతూ 'ఇది బావుంది కదా మామగారూ' అని దేన్నైనా చూపిస్తే 'మనం కొనుక్కుందాం' అంటాడు. పోనీ కొంటాడా అంటే పైసా తియ్యడు. ఏం మాట్టాడనీ, కథ మొదలెట్టేస్తాడు. 'బాబూ! ఒక్కగానొక్క ఆడపిల్ల గారాబంగా పెంచాను. ఇక మీ ఇష్టం అంటాడు. మాటి మాటికీ మాకు అక్కడో ఎకరం భూముందీ, ఆ మూలెక్కడో ఓ ఇల్లుంది అని పూటపూటకో కథ సాగతీసి మరీ చెప్తాడు. విన్న కథ అయినా, పోన్లే పెద్దవాడని గౌరవం కొద్దీ వింటామా? ఇంక అంతే బుక్ అయిపోయినట్టే. మరో కథ మొదలెట్టేస్తాడు. పేకబెత్తం ఎప్పుడు ఝళిపిస్తాడో తెలియని మాష్టారు దగ్గర నోరెత్తలేని పిల్లాడిలా భయంభయంగా నించోలేను. కథలన్నీ కట్టిపెట్టి అసలు విషయంలోకి ఎప్పుడొస్తాడా? అని ఎదురు చూపులు చూడలేను. ఎప్పుడో ఆయన పోయాక నీకు చెందే ఆస్థి కోసం ఇప్పటి నుంచి చేతులు కట్టుకుని కూర్చుని ఆ కథలు విన్లేను నేను" అన్నాడు. కిసుక్కున నవ్వింది అత్తగారు సుందరలక్ష్మి. కొడుకేం మాట్లాడినా ప్రతిదీ హాస్యమే ఆవిడకి. ఆవిడ నవ్వడమే తరువాయి ఆకాశం నుంచి పూల వర్షం ఉత్తుత్తినే కురిసినట్టు తన గదిలో

కూర్చుని బుద్ధిగా చదువుకుంటున్నట్టు కనబడే ఇంజినీరింగ్ వెలగబెడుతున్న రామకృష్ణ తమ్ముడు సర్రున హాల్లోకొచ్చేస్తాడు. చదువుకి ఎగనామం పెట్టే ఏ కొద్దిపాటి టైమూ వదులుకోడతడు.

అలాంటప్పుడే రామకృష్ణ ఇంకా గంగవెర్రులెత్తిపోతాడు. తమ్ముణ్ని 'చదువుకోరా' అని తెగ విసుక్కుంటాడు. బట్టీ కొట్టడం, మాంచి ఉద్యోగం సంపాదించడం కోసమే చదువని రామకృష్ణ ఘంటాపథంగా చెప్తాడు తమ్ముడికి.

"కాస్సేపు ఉండనీరా! నే ఊరుకుంటానేంటి చదవకపోతే" అని వత్తాసు పలికింది సుందరలక్ష్మి ఎప్పటిలాగే. ఆకలేస్తుంది కాబట్టి వండుకు తినడం, నిద్రొస్తుంది కాబట్టి నిద్రోవడం, సంపాదన కోసమే చదువు... ఇలాంటివే తెలుసావిడకి. పెద్దకొడుకు ప్రైం మినిష్టర్‌లా కనపడతాడు ఆవిడ కళ్లకి.

తాను పనిచేసే కంపెనీకి తనే హెడ్డు కాబట్టి,



మొట్టమొదటి ఇంటర్వ్యూలోనే తానా ఛాన్స్ కొట్టేశాడు గనుక తనెంతో గొప్పవాడిననే ఫీలింగ్ రామకృష్ణకి. రూపం కాస్త ఆకర్షణీయంగా ఉండడంతోపాటు మాంచి డ్రస్ సెన్స్ వుందని అందరూ మెచ్చుకుంటుంటే అందలం ఎక్కి కూర్చునట్టుగా ఉంటుందతడికి. ఇంట్లో సభ్యులు, పనిమనిషి, కంపెనీలో సబార్డినేంట్స్ తాను పరిపాలించే ప్రజల్లా, కుక్కిన పేనులా కన్పిస్తారు. సుందరలక్ష్మి పదేపదే 'నీకేంరా! మహారాజువి' అంటుండడంతో ఒక్కోసారి భుజకీర్తులు పెరిగి పెరిగి వీరావేశం వచ్చేస్తుంటుందతడికి.

'మానవత్వానికి సన్నిహితంగా రావాలంటే రామకృష్ణకి జీవితకాలం పట్టొచ్చు. రాత్రంతా ఇవే ఆలోచనలతో, అలజడులతో సతమతమవుతూ ఎప్పటికో నిద్ర పట్టిన మధుర శనివారం ఎనిమిదిన్నర దాటితేగానీ లేవలేకపోయింది. అప్పటిదాకా గది బయటే కాచుక్కూర్చుని హాలుహాలంతా కాలుగాలిన పిల్లిలా తిరిగాడు రామకృష్ణ. రూంలోంచి బయటికి వచ్చిన మధురని చూడగానే గబగబా దగ్గరకొచ్చి "బారెడు పొద్దెక్కాక మేల్కొన్న యువరాణీవారికి జయము జయము. సుప్రభాతం" అన్నాడు. భళ్ళున నవ్వింది సుందరలక్ష్మి. చటుక్కున వచ్చేశాడు మరిది.

"మా కంపెనీకి శనివారం శలవు లేదండీ" అన్నాడు వ్యంగ్యంగా. ఓ క్షణం గ్యాప్ ఇచ్చి మళ్ళీ అందుకున్నాడు.

"ఏంటన్నాడు మీ నాన్న పెళ్ళి చూపుల్నాడు? మాసిపెట్టి తల్లి పొద్దుగల్లే లేచి అన్ని పన్లూ చకచకా చేసేసి, నువ్వాఫీసుకెళ్ళే టైముకి కళకళ్ళాడుతూ, పెళపెళ్ళాడే పట్టుచీర కట్టేసుకుని, ముసి ముసి నవ్వుల్తో నీకు లంచ్ బాక్స్ అందిస్తుందని, అందరూ అవాక్కయే సూపర్ డూపర్ కథ చెప్పలే మీ నాన్న?" అంత పెద్ద ఆఫీసరు చేతులు పరపరా తిప్పేసుకుంటూ లొడలొడా వాగేస్తుంటే నిద్రమత్తు వదలని మధుర బిత్తరపోయి చూసింది. నిమిషం తర్వాత తెప్పరిల్లి గబగబా వాష్ రూం వైపు నడిచింది.

మరో రెండు నెలలు గడిచాయి. రామకృష్ణ మాటలు కోట దాటి పోయేంత తీవ్రత, వ్యంగ్యార్థాలు దాటి శాపనార్థాల దాకా వచ్చాయి. తొందర పడకూడదనే భావనతో ఊపిరి బిగపెట్టుకు బతుకుతోంది మధుర. ఆ సాయంత్రం ఇంక తాళలేక చనిపోయిన తల్లి పదే పదే గుర్తొచ్చి ఎవ్వరూ లేనప్పుడు ఫోన్ చేసింది తండ్రికి.

"బాగున్నావా తల్లీ?" అన్నాడు తండ్రి ఆప్యాయంగా. "నాన్నా" పిలిచింది గద్గద స్వరంతో. ఇద్దరికీ మాటలు పెగల్లేదు. నిజానికి మనిషికి హృదయాన్నించి వచ్చే చిన్న పలకరింపు చాలు. కాస్సేపటి నిశ్శబ్దం తర్వాత..

"తెలుసు నాకు నీ బాధలేవీ చెప్పవని. కానీ తల్లీ! రేపు రాకపోతుందా? పరిస్థితులన్నీ చక్కబడకపోతాయా?" అన్నాడు. చిన్నగా నవ్విన ధ్వని అతడి చెవులని తాకి కళ్ళు మూత పడి పెదవులు బిగపట్టేలా చేసి "నాన్నా! అమ్మ కోసం నేను పరితపిస్తుంటే నా దు:ఖం చూడలేక ఆనందమనేది రేపులో వుండదని, ఈ క్షణాల్లోనే వుంటుందని నమ్మబలికే వాడివి. నీ ఓదార్పుతో, నీ భరోసాతో నేను హాయిగా వుండేదాన్ని. అమ్మయినా, నాన్నయినా నువ్వేనని! ఇప్పుడు నువ్వు... సర్దుబాటు చేసుకోమని చెప్తున్నావ్ కదూ?" అంది.

"అబ్బెబ్బె! మా మధుర బంగారు తల్లి. పెళ్ళంటే నూరేళ్ళ పంట అనీ, ఓర్పు కాస్తంత పట్టాలనీ కదా చెప్తున్నది" అన్నాడాయన "ఆరోగ్యం జాగ్రత్త నాన్నా" అని ఫోన్ పెట్టేసి నిట్టూర్చింది.

"ఎవరికి ఫోను?" రామకృష్ణ గొంతు వినిపించింది. ఎప్పుడొచ్చాడో? "నాన్నకి" అంది.

"నాకు ఒళ్ళంతా కళ్ళే. కథలు నడపకు. ఇట్టే పట్టేస్తాను. సరే సరే మాంచి కాఫీ పట్రా. ఇలావెళ్ళి అలా రావాలి" అన్నాడు రిలాక్స్‌డ్‌గా కూర్చుంటూ. వంటింటి వైపు వచ్చిన ఆమెతో ఆలోచనలు కూడా తోడొచ్చి పెళ్ళయిన కొత్త రోజుల్లోకి లాక్కెళ్లాయ్!

కంప్యూటర్స్‌లో మాస్టర్స్ చేసిన తన ఆరుగురు స్నేహితులూ, తనూ తమ పల్లె చదువు పూర్తయ్యాక పైచదువులకి పట్నం వచ్చి హాస్టల్స్‌లో వుండి చదువుకున్నవాళ్ళే. పెళ్ళయిన నాలుగు రోజులకి తమ ఫోటో ఆల్బమ్ సరదాగా తీసి భర్తకి చూపిస్తే మధురకి ఎడంపక్క నిల్చున్న అబ్బాయి గురించి ఆరా తీశాడు.

"వీడా? వీడు చంద్రహాస్!" అంది సరదాగా.

"చాలా అల్లరివాడు. మా పాలేరు కొడుకని గిట్టని వాళ్ళంటారు. కానీ ఆ తేడాలు లేవు నాన్నకి.." అంది.

"పెళ్ళికి రాలేనట్టుంది" అన్నాడు.

"క్యాంపస్ సెలక్షన్స్‌లో లక్ తగిలి మంచి ఉద్యోగం వచ్చి వెంటనే ఆర్నెల్లు ట్రయినింగ్‌కి హైద్రాబాద్ వెళ్ళాడు. పూర్తి అవగానే మనింటికి వచ్చి మనని చూసే వెళ్తానన్నాడు. ఈ లోపల వాళ్ళ తాతకి జబ్బు చేసి హాస్పిటల్ల చుట్టూ తిరుగుతున్నాడు." అంది.

"వచ్చి పోతూండమను నీ ఫ్రెండ్స్‌ని. మిగతా అందరి గురించి కూడా చెప్పు మరి!" అన్నాడు.

'ష్యూర్!!' అంది ఉత్సాహంగా. తమ స్నేహం, చిన్ననాటి అల్లర్ల దగ్గర్నుంచి చదువయి విడిపోయే ముందు ఎవరికి ఏ కష్టం వచ్చినా ఒకర్నొకరు ఆదుకోవాలని చేసుకున్న ప్రమాణాల దాకా ఆపకుండా చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో తళ తళ.

"అయ్య బాబోయ్! కదిపితే కథలు చెప్తున్నావు" అన్నాడు తమాషాగా "అరె! కథలు కావు నిజం. మేం ఒకరికొకరు తోడు. మాట తప్పని జట్టు మాది." అంది.

'ఓహో' అన్నాడు. ఆ తర్వాత తర్వాత ఏం మాట్లాడినా "నువ్వు కథలు రాయి పైకొస్తావ్" అనే వాడు. అవే మాటల్ని అట్నుంచి ఇటూ, ఇట్నుంచి అటూ మారుస్తూ అంటుంటే వినీవినీ చివరికి మూగబోయింది మధుర.

ఆదివారం రామకృష్ణా బీచ్ అలల నురుగులాంటి చీరలో మెరిసిపోతోంది మధుర. ఆమె మెడ పొడవుగా చూడ ముచ్చటగా వుంది. ఎంత వద్దనుకున్నా దొంగ చూపుల్తో ఆమెనే చూస్తున్నాడు రామకృష్ణ. అక్కడున్న సిమెంటు గట్టు మీద కూర్చుని అరగంట దాటింది. ఒక్కమాట కూడా మాట్లాడకుండా ముభావంగా కూర్చుంటే పలకరిద్దామని అతడి చేతి మీద తన సున్నితమైన చేతిని సుతారంగా వేసింది. వెంటనే తన చేతిని వెనక్కి లాగేసుకున్నాడు రామకృష్ణ. దానిక్కారణం అంత క్రితమే ఇంటి నుంచి బయల్దేరే ముందు చంద్రహాస్ ఆ ఊరు వచ్చానని త్వరలో కలుస్తానని ఫోన్ చేయడమే. మరీ బింకంగా వుండలేక ఆమె

వైపు తల తిప్పాడోసారి. అల్లరిగా నవ్వింది మధుర. "మురీ మిక్చర్ తింటావా?" అడిగాడు. వాళ్ళకి కొద్ది దూరంలో కూర్చున్న మురీ బండివాడు కొంటే గానీ కదిలేట్టు లేడు మరి! హుషారుగా తలూపింది.

"చెత్త తిళ్లు!" అన్నాడు పొట్లం అందిస్తూ. నవ్వింది మధుర. ఆ నవ్వు మల్లె పూవు. కాస్సేపటికి ఐస్‌క్రీం వాడొస్తే ఐస్‌క్రీమ్ కొని పెట్టాడు. తినబోతుంటే ఆ చంద్రహాస్ గాడు నీకు ఒట్టి ఫ్రెండేనా?" అడిగాడు అసహనంగా. మళ్ళీ నవ్వింది మధుర. తేనెలొలికే నవ్వు.

"నీ ఫ్రెండ్స్ పేర్లేమిటన్నావ్"? మాట మార్చాడు.

"మధు, శ్రీధర్, చంద్రహాస్, సుమ, నళినీ, కామేశ్వరి మేమంతా క్లోజ్ ఫ్రెండ్స్."

"క్లోజ్ అంటే?"

"చెప్పానుగా? మాలో ఎవరికి ఏ కష్టాలొచ్చినా మిగతావాళ్ళు ఆదుకునేంత" అంది వెనిల్లా సుతారంగా చప్పరిస్తూ. తిక్కెక్కి పోతోందతడికి. భర్త వేసే ప్రశ్నల్ని అతి తేలిగ్గా తీసుకుని హాయిగా ఆన్సర్లు చెప్తుంటే. అందుకే కసిగా అన్నాడు.

"ఇలా కనిపించిందల్లా మెక్కడం అలవాటయితే దిబ్బకొక్కులా తయారై ఇంటి చాకిరీ ఏం చేస్తావ్? ఆడది తిరిగి చెడింది, మగాడు తిరక్క చెడ్డాడుట. మగాళ్ళతో స్నేహాలేంటి నీకు? భ్రమల్లో బతక్కు!" అన్నాడు. నో ఆన్సర్...

"నీకే చెప్తుంట! ఆ 'చంద్రహాస్' గాడు రెక్కల గుర్రం మీదొచ్చి చుక్కల లోకం చూపిస్తాడనీ, నీ కష్టాలు తీర్చేస్తాడని ఎన్నడూ అనుకోకు!" అన్నాడు కచ్చగా. "వస్తాడు" అంది ధృడంగా, శివమెత్తిపోయాడు రామక్రిష్ణ.

"పిలవ్వే! పిలువ్! రాడని చాలెంజ్ చేస్తాను" అన్నాడు చిటికేస్తూ. హ్యాండ్‌బాగ్ జిప్ సర్రున లాగి మొబైల్ తీసి కొన్ని నంబర్లు ప్రెస్ చేసింది. "దీనికెంత ధైర్యం?" గట్టిగానే అని పళ్ళు పటపట లాడించాడు.

"తన కోపమే తన శత్రువు" అంది మధుర.

"నోర్ముయ్! అరిచాడు. ఆమె ఆలోచనలు వాతావరణం ఉధృతంగా ఉన్నప్పుడు సముద్రపు అలల్లా ఎగిసి పడుతున్నాయి. పది నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. ఓ మోటార్ సైకిల్ శబ్దం చేస్తూ వాళ్ళ ముందుకొచ్చి ఆగింది. మధుర లేచి బైక్ దగ్గరకెళ్ళి గిర్రున వెనక్కి తిరిగి రామక్రష్ణని సమీపించి స్పష్టంగా అతడికి వినిపించేలా అంది. "సంసారం అంటే ప్రగాఢమైన ప్రేమను లోలోతుల్నించి పంచడం. అప్పుడు అహం చెల్లాచెదురై ఆలుమగలు ఒక్కటవుతారు. నీలో... ఆడదాన్ని చులకనగా చూడడమనే పొగరు అంచెలంచెలుగా ఎప్పట్నించో ట్రాన్స్ఫర్ అవుతూ వస్తోంది. ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరు 'చెక్' చెప్పే తీరాలి. ఆగాగు ఇప్పుడు నువ్వేం 'కథలు చెప్పకు' ఆ ఛాన్స్ నీకింక లేదు అంది. నీ సాధింపు చర్యలకి నీకో బహుమానం. ఇప్పుడివ్వకపోతే రానున్న కాలంలో కూడా మారవు" అంది. మరు క్షణంలో చేష్టలుడిగి చూస్తున్న రామక్రష్ణ దవడ ఫెళ్ళుమంటూ పేలిపోయింది. నోట మాట రాకుండా కళ్లప్పగించి చూస్తున్న అతడిని చూస్తూ ఈసారి మళ్ళీ నవ్వింది మధుర. ఆ నవ్వు గెలుపుది. ధీరత్వానిది. రౌద్రానిది. రాబోయే ప్రగతిది. మోటార్ సైకిల్ ఊపందుకుంది. కళ్ళు బైర్లు కమ్మి ప్రపంచం తల్ల కిందులవుతున్నట్లు అనిపిస్తున్న రామక్రిష్ణకి దూరంగా సాగిపోతూ కన్పిస్తోంది.. స్వేచ్ఛగా రెపరెపలాడుతూ ఎగురుతున్న మధుర కొంగు.

గురువుదేవర

- ఎండపల్లి భారతి
9652802460

'రేయ్ మామా, ఊర్లో ఎవురింట్లోనన్నా పెండ్లి అంటే, ఇంటి ముందర పందిరి యెయ్యాల్ల. వంటకి కట్టెలు చీల్చల్ల. పెండ్లి బంతిలో వాళ్లు అన్నాలు తిన్నెంక ఆ ఎంగిలాకుల్ని ఎత్తల్ల. వాళ్ల ఇండ్ల ముందర మన ఆడోళ్లు పొయి అలికి ముగ్గులు యెయ్యాల్ల. వాళ్ల ఇండ్లల్లో చావైతే మనోళ్లే పొయి పలకలు కొట్టల్ల, టపాసులూ ఆకాసువ్వలూ వదలల్ల, పాడికి యెదుర్లు కొట్టల్ల, గుంత తొగల్ల. వాళ్లింట్లో గొడ్డు సస్తే, 'మాదిగోన్ని రమ్మనండి, వాళ్లే దాన్ని తినేది' అని పిలిపిస్తారు. ఈ పొద్దు చేను పనులు చానా ఉండాయంటే, 'మాదిగపల్లికి పొయి పదిమంది ఆడోళ్లనీ పది మంది మగోళ్లనీ రెడ్డి చెప్పినాడని చెప్పి తోలుకుని రాపోండి' అంటారు. సల్లారి సద్దిబట్టిన పండగ పలారాలని మన బోకుల్లో తలా కాసింత యేసి పంపిస్తారు. ఇట్ల అన్నిటికీ పిలస్తారు కదా అని ఈ పొద్దు వాళ్లు గురువుదేవర చేసుకుంటాంటే పోతి. నేనేమి తప్పు చేస్తిని మామా?" అని కొండప్ప మామ దగ్గిర తన వెతనంతా వెళ్లబోసుకుంటా ఉండాడు మా వెంగటన్న. ఇంటి ముందర చెత్త తోస్తా వాళ్ల మాటల్ని వింటా ఉండాను నేను.

"నువ్వు ఏ ఇంటికి పోతివిరా? వాళ్లింటికి గురువుదేవర చేసేటప్పుడు మన మాదిగోళ్లని వాళ్లు రానిచ్చేది లేదని తెలవదా?" అన్నాడు కొండప్ప మామ.

"నాకు తెలవదు మామా. అయినా అదేమి తప్పా మామా, నా పొట్టేల్ని తీసుకుపోయిరి కదా, ఒక ముద్ద పెడతారులే అని పోతి. వాళ్ల ఇంటి ముందరికి పొయేతలికి పోలు పోసిండారు. ఆడికి పొయి నిలబడితి. సామిరెడ్డోళ్ల అమ్మ వచ్చి 'రేయ్ మాదిగినాబట్టా, ఇంటి ముందరికి రావద్దు, ఈ పొద్దు గురువుదేవర, మీ మాదిగోళ్లని చూడగూడదు' అనింది. ఆ మాటకి నాకు చానా యెత్తె పొయింది. ఒరె ఒరె, నా మందలో నింటి కొమ్ములు తిరిగేటట్లు మూడేండ్లు ఉలవలు పెట్టి మేపిన పొటేల్ని, ఆరుమూర అద్దమానంగా ఎత్తుకుని పొయి రెడ్డికిస్తినే, రెడ్డి మాట మీరనేల గెడ్డపార మింగనేల అని ఎదురు చెప్పలేక ఇస్తినే. ఏదో ఆ ఇంటి ముందరికి



పోతే గెంటెడు కూరా ముద్ద సంగటీ పెట్టకపోతారా అని గదా నేను పొయింది. దానికే ఆయమ్మ అంత మాట అనల్లనా!

నువ్వే చెప్పు కొండమామా, నేను తినిన సంగటే నా పొట్టేలికి పెడితిని. నా కడవలో నీళ్లు పోసే ఉలవలు ఉడకబెట్టి పెడితి. నేను తినిందల్లా నా పొట్టేలికీ పెట్టి మేపితి. దానిని మటుకు వాళ్ల దేవునికి కొట్టచ్చు, వాళ్లు తినచ్చు. నేను మటుకు తినకూడదు. ఇది ఏటి న్యాయము మామా" అని కడుపులోని బాధనంతా వెళ్లబెడతా ఉండాడు వెంగటన్న.

అంతలో సామిరెడ్డి వాళ్లన్న మల్లిరెడ్డి వచ్చి, 'రేయ్ కొండిగా, యెంగిటిగా తెల్లవారి మూర్తానికి బాయికాడ టెంకాయ పట్లు కొట్టల్ల, మీ ఇద్దురూ వస్తే మీ జతకి ఇంగొక ఐదుమందిని పిలుసుకుని రండి. తెల్లవారేతలికి పందిళ్లు వెయ్యాల్ల" అనేసి పొయినాడు.

అంతసేపు అరుట్లు కొట్టిన మా వెంగటన్నా కొండప్ప మామా లేసి, కిందేసుకున్న తుండు గుడ్డల్ని ఎత్తి విదిలిచ్చుకుని బుజాన వేసుకుని సక్కా పోయిరి పందిళ్ల పనికి.



పైన్‌యాపిల్ జ్యూస్



కావాల్సినపదార్థాలు

పైన్‌యాపిల్ ముక్కలు - 2 కప్పులు, పాలు - 3 కప్పులు
పంచదార - 1/2 కప్పు, తేనె - 2 టేబుల్ స్పూన్లు, నిమ్మరసం - 2 టేబుల్ స్పూన్లు

తయారు చేసే విధానం

ముందుగా పైన్‌యాపిల్ తొక్కతీసి ముక్కలుగా కట్‌చేయాలి. మిక్సీ జార్‌లో పైన్‌యాపిల్ ముక్కలు పంచదార వేసి గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత పాలు, నిమ్మరసం వేసి మరోసారిగ్రైండ్‌చేయాలి. ఇప్పుడు జ్యూస్‌ని ఒక బౌల్‌లోకి తీసుకుని అందులో తేనె వేసి బాగా కలపాలి. ఇక పైన్‌యాపిల్ జ్యూస్‌ని గ్లాస్‌లో పోసి కొన్ని ఐస్ ముక్కలు వేసి వేడి వేడి సమ్మర్‌లో ఈ కూల్ జ్యూస్‌ని అతిథులకు సర్వ్ చేయండి.



యాపిల్ జ్యూస్

కావాల్సిన పదార్థాలు

యాపిల్స్ - 2
పంచదార - 2 టేబుల్ స్పూన్లు
పాలు - 2 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

ముందుగా యాపిల్స్‌ని బాగా కడిగి పెచ్చు తీసి ముక్కలుగా కట్‌చేసుకోవాలి. తర్వాత మిక్సీ జార్‌లో యాపిల్ ముక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇప్పుడు అందులో పాలు, పంచదార వేసి మరోసారి గ్రైండ్ చేసుకోవాలి. రుచికరమైన యాపిల్ జ్యూస్ రెడీ! జూస్‌ని చేసిన వెంటనే తాగితే భలే టేస్టీగా ఉంటుంది.

ఆరెంజ్ జ్యూస్

కావాల్సిన పదార్థాలు

మీడియం సైజు కమలాలు - 4
పంచదార - 1 టేబుల్ స్పూన్

తయారుచేసే విధానం

ముందుగా కమలా పళ్లను తొక్కతీసి తొనల్లో వుండే గింజల్ని తీసేయాలి. గింజలు తొలగించపోతే జ్యూస్ చేదుగా మారుతుంది. మిక్సీ జార్ తీసుకుని గింజలు వలిచిన కమలా తొనల్ని వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇప్పుడు టీ వడపోసే నెట్‌తో జార్‌లోని జ్యూస్‌ని ఒక బౌల్‌లోకి తీసుకోవాలి. అందులో పంచదార వేసి బాగా కలపాలి. లేదా ఒకసారి మిక్సీలో గ్రైండ్ చేసుకోవచ్చు. ఈ టేస్టీ ఆరెంజ్ జ్యూస్‌ని గ్లాసులో పోసి ఐస్ ముక్కలు వేసి అతిధులకి అందించండి!



స్ట్రాబెర్రీ జ్యూస్



కావాల్సిన పదార్థాలు

పెరుగు - 1 కప్పు
స్ట్రాబెర్రీలు -2 కప్పులు
పంచదార - 1 కప్పు

తయారు చేసే విధానం

ముందుగా స్ట్రాబెర్రీలను శుభ్రంగా కడిగి గింజలు లేకుండా మిక్సీలో వేసి గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత పెరుగు, నీరు, పంచదార వేసి మరోసారి మెత్తగా గ్రైండ్ చేయాలి. జ్యూస్‌ని ఒక బౌల్‌లోకి తీసుకుని అరగంట సేపు ఫ్రిజ్‌లో ఉంచి తర్వాత అతిథులకు సర్వ్ చేస్తే టేస్టీగా ఉంటుంది.

పుచ్చకాయ జ్యూస్

కావాల్సిన పదార్థాలు

పుచ్చకాయ ముక్కలు - 2 కప్పులు
మిరియాల పొడి - 2 టీ స్పూన్లు
ఉప్పు - చిటికెడు
తేనె - 1 టేబుల్ స్పూన్
పుదీనా ఆకులు - 5
పంచదార - 1 టేబుల్ స్పూన్
ఐస్ ముక్కలు - సరిపడినన్ని

తయారుచేసే విధానం

ముందుగా పుచ్చకాయ చెక్కును తొలగించి ముక్కలను వేరు చేసి చిన్న చిన్న ముక్కలుగా కట్‌చేసుకుని వాటిలో గింజలు లేకుండా చూసుకోవాలి. ఇప్పుడు మిక్సీ జార్‌లో పుచ్చ ముక్కలు, పంచదార, మిరియాల పొడి, పుదీనా ఆకులు, ఉప్పు వేసి గ్రైండ్ చేసుకోవాలి. జ్యూస్‌ని ఒక గిన్నెలోకి తీసుకుని అరగంట సేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. తర్వాత బయటకు తీసి జ్యూస్‌లో తేనె కలిపి సర్వింగ్ గ్లాసులో ఐస్ ముక్కలు, జ్యూస్ వేసి పుదీనా ఆకులతో గార్నిష్ చేసి అతిథులకు సర్వ్ చేయండి.



ఒంటె

పిల్లలూ మీకు ఒంటె ఎక్కడ మంటే భలే ఇష్టం కదూ! చేతి వేళ్లతో ఒంటె బొమ్మ ఎలా చేయొచ్చో ఇక్కడ చూసి, చీకటి గదిలో క్యాండిల్ వెలిగించి మీరూ ప్రయత్నించండి.



పదాలు పూరించండి

ఇక్కడ ఏడు బొమ్మలున్నాయి. వాటి ఇంగ్లిష్ పేర్లలో ఒకటి రెండు అక్షరాలు మిస్సయాయి. ఆ అక్షరాలని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా అడ్డం, నిలువు గళ్లలో మిస్సయిన అక్షరాలను నింపేయండే!

	b	e			
		u	n		
			p	l	e
	s	h		e	
	h	a	n		
		o	c	k	
		i	o	n	

bee,sun,apple,sheep,ha nd,lock,lion

పిల్లలెక్కడ?

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తితో పాటు తన ముగ్గురు పిల్లలు ఉన్నారు. వాళ్లెక్కడున్నారో మీరు గుర్తించి రౌండ్ చేయండే!

బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేను టాలీవుడ్ స్టార్‌ని. ఝుమ్మంది నాదం, ప్రయాణం, రాజుభాయ్, శౌర్యం సినిమాల్లో హీరోని. ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పుండి?



ఎన్నున్నాయి?

స్వీటీ తన కుక్కపిల్లతో ఓ గార్డెన్‌లో ఆడుకుంటోంది. అయితే స్వీటీకి సంబంధించిన కొన్ని వస్తువులు కూడా ఈ గార్డెన్‌లోనే ఉన్నాయి. పక్కన ఇచ్చిన వస్తువుల ఆధారంగా అవెక్కడున్నాయో కనిపెట్టండి.

దారి కనిపెట్టండి

చింటు టిఫిన్ బాక్స్‌లో వాళ్ల అమ్మ కొన్ని పదార్థాలను ఉంచింది. వాటిలో కప్ కేక్ ఒకటి మిస్సయింది. దాన్ని తెచ్చుకునే దారి కనిపెట్టడంలో మీరూ చింటూకి సాయపడండి.



లిల్లీ ఫ్లవర్ బొకే

పిల్లలూ మన ఇంట్లో పూలమొక్కలను పెంచుతుంటాం కదా! వాటిలో లిల్లీపూలు మంచి సువాసనతో భలేగా వుంటాయి. పొడుగ్గా, అందంగా ఉండే ఈ పూలతో చేసే బొకేలను పెద్దవాళ్లు చాలా ఇష్టపడుతుంటారు. సీజనల్‌గా పూసే ఈ పూలను ఇప్పుడు మీ గార్డెన్‌లో పూయించడం కష్టమే! ఐతే వాటిని మీ ఇంట్లో దొరికే కొన్ని వస్తువులతో తయారుచేయచ్చు.



కావాల్సిన వస్తువులు : స్ట్రాలు (ముదురు ఆకుపచ్చ రంగు)–3, డెకరేటివ్ రిబ్బన్ (లేత ఆకుపచ్చ రంగు), టేపు, కత్తెర, రంగు పెన్సిళ్లు/స్కెచ్ పెన్, కన్‌స్ట్రక్షన్ పేపర్

తయారు చేసే విధానం : కన్‌స్ట్రక్షన్ పేపర్‌పై మీ చేతిని వుంచి స్కెచ్ పెన్‌తో చేతి ఆకారాన్ని మార్క్ చేయండి. ఇలా మీకు నచ్చినన్ని గీసుకోవచ్చు. ఇప్పుడు వాటిని జాగ్రత్తగా కత్తిరించి ఒక కోన్‌లా మడిచి గమ్‌తో అతికించండి. చేతి వేళ్లలా కత్తిరించిన వాటిని వెనక్కి మడవండి. ఇప్పుడు డెకరేటివ్ రిబ్బన్‌ని సమాన భాగాలుగా కత్తిరించి కోన్‌లా మడిచిన భాగం నుండి కొంచెం పైకి వచ్చేలా వాటిని వుంచాలి. మీరు తయారు చేసిన పూలని లెక్కపెట్టి అన్ని స్ట్రాలను తీసుకోండి. ఇప్పుడు ఒక్కో స్ట్రాలో ఒక్కో పువ్వునూ గుచ్చితే లిల్లీ పూలు రెడీ! ఇక ఆలస్యం చేయకుండా మీరు తయారు చేసిన పూలన్నిటినీ డెకరేటివ్ రిబ్బన్‌తో కట్టి అమ్మానాన్నలకి వాళ్ల పుట్టినరోజున ఇచ్చి సర్‌ప్రైజ్ చేయండి.



తేడాలు గుర్తించండి

పిల్లలు ఈ చిత్రంలో ఏడు తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.



పదవికాసం - 5

కూర్పు: టి.డి. ప్రసాద్

ఆధారాలు

అడ్డం

1. సూర్యచంద్రులకు సైతం ఇది పడుతుందంటారు (3)
3. నల్లమబ్బు (4)
6. బిళహరిలో వినిపించని తొలి సగం (2)
7. ఏరు (2)
8. డబ్బు (2)
9. వెనుదిరిగిన పావురము (4)
11. పో.. ఆంగ్లంలో (1)
12. వినమ్రత (3)
13. చిక్కుముడిలో చిక్కు లేదు (2)
14. అడ్డం 11తో నఖము (1)
15. మావిచిగురులో చిగురు లేకపోతే.. (2)
17. అటునుంచి తాయం (2)
19. ఆకాశం (3)
22. 1 తర్వాత 5 సున్నాలు (2)
24. రిపేరు (4)
25. తియ్యనిది, యు.పి.లో ఒక పట్టణం (3)
27. తాతఎత్తుకు 4,5,2,3 (4)
31. వందేమాతరంలో మొదలెక్కడ? (1)
32. పురుగులు తొలిచే శబ్దం (4)
34. స్త్రీల దినోత్సవం.. మొదటి సగం మరోలా (3)
36. అడ్డం 11, 14, 31తో కలిపితే దీన్ని చిలుక భర్తగా పోల్చుతారు (1)
37. వాన --- ప్రాణం పోకడ (3)
38. రజనీకాంత్ నటించిన 'రోబో'లో యంత్రుడి పేరు (2)
39. ఏనుగు (2)
40. పేరు చివర గౌరవంగా అనేది (2)

1	2		✿	3		4		✿	5
6		✿	7		✿		✿	8	
9		10		✿	11	✿	12		
✿	13		✿	14	✿	✿	15		✿
16	✿	17	18	✿	19	20		✿	21
22	23	✿	24				✿	✿	
✿	25	26		✿	27		28	29	✿
30	✿		✿	31	✿	32			33
✿	34		35	✿	36	✿	37		
38		✿	39		✿	40		✿	

నిలువు

1. సౌర కుటుంబంలో భూమి కూడా ఒక --- (3)
2. పచ్చదనం (4)
3. నాది కాదు (2)
4. డాబా (2)
5. తాగదగినది (3)
7. మేనకలో ఐదో మాసం లోపించింది (2)
8. విజ్ఞాపన (3)
10. స్పీకర్ ఎదుట ప్రతిపక్షాలవారు వచ్చి నిలబడే స్థలం (3)
12. ఆకాశంలో సంచరించే వాహనం (3)
16. ఈలకోడిలో కోడి పోయింది (2)
18. కమలం (3)
19. విచిత్రం, ఆశ్చర్యం (3)
20. ఎగుడు దిగుడులు (4)
21. మూత్రపిండం.. ఆంగ్లంలో (2)
23. ఓర్పు, నేల (2)
26. ధురంధరుడికి హితవు 1,4,7 (3)
28. వివాదం (4)
29. మూషికం (4)
30. సాధికారత.. ఐదింట నాలుగొంతులు మొదట్నుంచీ లేదు మహిళలకు (1)
33. చివరకు (3)
34. మన్ను (2)
35. కళను పైకి పిలవండి (2)

సుడోకు

			8		7	1	2	9
6								4
		2	5		4			8
7		5	1	4		2		
	1		6		2		3	
		6		5	3	4		1
9			3		5	8		
2								7
5	4	7	2		8			

గతవారం జవాబులు

1 క	2 లి	3 మి	4 లే	ము	5 లు	✿	6 కా	7 క	✿
8 న	గ	ర	ము	✿	9 తే	10 రు	✿	11 లు	కూ
కం	✿	ప	✿	12 గో	✿	13 తె	14 లు	పు	✿
✿	15 జం	✿	16 వు	✿	17 లు	వా	ఆ	✿	18 ట్టు
19 జా	బు	20 లు	✿	21 ఆ	వే	గు	✿	22 నం	✿
23 న	క	ర్రా	24 రా	కు	✿	25 లు	26 మూ	✿	27 మూ
✿	ము	✿	త్రి	✿	28 అ	✿	29 రు	30 కా	షి
31 డా	✿	32 మీ	✿	33 వ	✿	34 ప్ర	బా	ళి	క
35 గు	36 డ్డ	✿	37 బెం	గ	✿	38 కా	లు	✿	మి
✿	39 బి	లం	✿	40 లు	ఖా	శం	✿	41 మా	త్ర





కలపడమూ కళే

విడివిడిగా చూస్తే... వీటివి విభిన్న ప్రపంచాలు. ఒకటి ఆకలి తీర్చేదైతే... మరొకటి అధునాతన జీవనానికి ప్రతిబింబంగా నిల్చేది. ఈ రెండిటినీ కలిపి ఒక చక్కటి కళాఖండాన్ని సృజించవచ్చని నిరూపించాడు అట్లాంటా కళా దర్శకుడు స్టీఫెన్ మెక్‌మెన్నమీ. రెండు వేర్వేరు ఫొటోలను కత్తిరించి అతికించాడంతే. కాకపోతే అక్కడే అతని నైపుణ్యమంతా దాగివుంది. కుశాగ్రబుద్ధులు ఇట్టే పసిగట్టేయొచ్చు. ఏమంటారు?! ◆







ఉత్పాదన భూమిపైనే అయినది, కానీ భూమిలోపల 'జైన్ డ్రిప్'తో సరి అయిన గాలి తగిలినచో పంట దిగుబడి అధికమగును



జైన్ డ్రిప్ వలన ఉపయోగాలు :

- జైన్ డ్రిప్, పంటకు ఎంత నీరు కావలయునో అంతే నీటిని అందించును. ఇందువలన పంటకు ఇచ్చు పోషక పదార్థములు పంటకు పూర్తి స్థాయిలో ఉపయోగపడి ఫల, పుష్పాలు సమృద్ధిగా వృద్ధి చెంది ఎక్కువ దిగుబడి ఇచ్చును. -అవసరమైనంత వరకే నీరు పంటకు అందుటవలన, అంకురమునుండి, ఫలించువరకు మొక్కలు దృఢముగా ఉండును. -మొక్కకు అందుబాటులో తేమ లభించుటవలన మొక్క ఏపుగాపెరిగి పంటలో అధిక దిగుబడికి దోహదము చేయును. - ఎంతో విలువైన నీరు తగిన మోతాదులో లభించుట వలన పంటలో 80 నుండి 90 శాతము నీటి సద్వినియోగమునకు అవకాశము కలదు.- ప్రస్తుత విద్యుత్ కొరతలో బిందు సేద్యము, విద్యుత్ ఆదాలో రామబాణములాగా పనిచేయును. - కూలీల ఖర్చులో ఆదా, - అధిక వ్యయముతో కూడుకున్న రసాయనిక ఎరువులు, నిర్దేశించిన ఫలితము పంట పై ఇచ్చి, అధిక దిగుబడులకు ఆస్కారము కలదు. - ఆశించిన స్థాయిలో పంట పొందుటకు దోహదము చేయును.

జైన్

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/బి/5, పార్క్ ఎదురుగా, కెనరాబ్యాంక్ దగ్గర, గాంధీనగర్, హైదరాబాద్

హైదరాబాద్ ఫోన్ నంబర్లు : 040-2761-4474, 2761-1706.

ఆంధ్రా ఫోన్ నంబర్లు : 9440797807, 9440797881, 9440797840

తెలంగాణ ఫోన్ నంబర్లు : 9440797846, 9440797816, 9440797888

అమ్మ వేసిన జడలు

షెల్లీ, గ్రేస్

పొద్దున లేచినప్పటి నుంచి అన్ని పనులూ ఉరుకులు పరుగులతోనే మొదలౌతాయి. ఇక చదువుకునే చిన్నారులున్న తల్లులకి ఈ పరుగులు ఇంకొంచెం ఎక్కువే. వాళ్లకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం సిద్ధం చేయడమంటే మాటలు కాదు. పైగా అన్నీ సమయానికి అయిపోవాలి. ఇక కుదురుగా కూర్చొని పిల్లలకు జడేయడమంటే తల్లులకి ఓ పెద్ద పరీక్ష! ఐతే షెల్లీ గిఫర్డ్ మాత్రం అందుకు మినహాయింపు. తన కూతురు గ్రేస్‌కు రోజుకో రకం జడలు వేస్తుంది. తన చిట్టితల్లిని అందరి కంటే ప్రత్యేకంగా ముస్తాబు చేయడమంటే ఆమెకెంతో ఇష్టం. అందుకోసం సోషల్ మీడియాలోని రకరకాల సైట్స్‌ని వెతికి విభిన్నమైన జడలు వేయడం నేర్చుకుని మరీ గ్రేస్‌ని, తన నేస్తాలను మెప్పించేది. ఫ్రెంచ్, జపనీస్, స్పానిష్ ఇలా ఎన్నో రకాల జడల్ని షెల్లీ కేవలం పదిహేను నిమిషాల్లోనే వేసేస్తుంది. రోజుకో కొత్త రకం జడతో ప్రత్యక్షమయ్యే గ్రేస్‌కు పాఠశాలలో ఓ ప్రత్యేక గుర్తింపు వుంది. ఆమే కాదు! షెల్లీ సైతం మెల్‌బోర్న్‌లో ప్రముఖురాలైపోయింది. మరి తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలలో వుంచిన గ్రేస్ జడల ఫొటోల మహిమ అంతా! ◆



Check List

Book Number	KNSR02B112	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29